నటనా నవాబ్



ENTERED
KSR02B114

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మార్చి 27, 2016

కూ....ల్



మత్తెక్కని తారలు

రీల్ లైఫ్‌లో మందేసి చిందేస్తూ ప్రేక్షకులకి సైతం ఊపు తెప్పించేలా డ్యాన్సేసే తారలు కొందరైతే.. ప్రేయసి విరహ వేదన భరించలేక బాటిళ్లను ఖాళీ చేసే పాత్రల్లో అభిమానుల కంట తడిపెట్టించిన నటులు కొందరు. తాగుడు పాత్రలతో హాస్యం పండించే వాళ్లున్నారు. పింట్ పోటీల్లో ఇరగదీసి నటించేసే వాళ్లున్నారు. కానీ వీరిలో కొందరు నిజ జీవితంలో మాత్రం మద్యం మాటే ఎత్తరు. కొందరేమో తెరపై ఆ పాత్రల్లో నటించడానికి కూడా ఇష్టపడరు. మద్యనిషేధాన్ని పక్కాగా పాటించేస్తున్న తారల్లో ఒకడైన అభిషేక్‌కు తన తండ్రి అమితాబే స్ఫూర్తి. కండల వీరులు అక్షయ్ కుమార్, జాన్ అబ్రహామ్‌లు కూడా నిజ జీవితంలో మందు పార్టీలకి,ధూమ పానానికి దూరంగానే ఉంటారు. అలా అని సీక్రెట్‌గా ఏమీ దమ్ము కొట్టే చాన్సే లేదు. అంత మాట మీదుంటారని సన్నిహితులంటారు. 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' సినిమాతో మంచి బ్రేక్ సాధించిన సిద్ధార్థ్ మల్హోత్రా కుర్ర హీరోనే అయినా ఆల్కహాల్‌కు నో చెప్పి పెద్ద నిర్ణయమే తీసుకున్నాడు. తక్కువ ఆల్కహాల్ శాతం ఉన్న డ్రింకులు తాగడం బాలీవుడ్ ముద్దుగుమ్మలకు పెద్ద విషయం కాదు గానీ కొందరికి మాత్రం ఆ వాసన కూడా పడదు. పరిణీతి చోప్రా, దీపికా పదుకొనె, బిపాసా బసు, సోనమ్ కపూర్, సోనాక్షీ సిన్హా మత్తు పానీయాలకి టోస్ట్ కొట్టరు.

అక్షయ్

జాన్ అబ్రహం

అభిషేక్

దీపికా

సిద్ధార్థ్

సోనాక్షి

సోనమ్

ENTERED
KSR0213114

అందనంత ఎత్తుకు..



ఎవరైనా కీర్తిని సాధిస్తే ఎవరెస్ట్ అంత ఎత్తుకు ఎదిగాడని పొగడ్తలతో ముంచెత్తుతారు. కొండల్లోనే పుట్టి.. ఏ చదువు సంధ్య లేకపోయినా ఎవరెస్ట్ అంత ఎత్తు కాదు.. నిజంగానే ఎవరెస్ట్‌ను ఎక్కితే.. అతడిని ఎంత పొగడాలి. కేవలం సంకల్పబలంతోనే చరిత్రలో తనకంటూ పేజీలను సృష్టించుకున్న ఓ హీరో కథ ఇది.

పర్వత శ్రేణుల్లో పుట్టాడు. కళ్లు తెరిచాక ముందు ఎత్తయిన కొండలనే చూశాడు. హిమాలయ పర్వతాలను చూస్తూనే పెరిగాడు. హిమాలయాలనే ప్రేమించాడు. ఎవరెస్ట్ అతనికి డియరెస్ట్ అయింది. ఒకసారి కాదు రెండుసార్లు కాదు పదే పదే ఎవరెస్ట్‌ను ముద్దాడాలని ప్రయత్నించాడు. కష్టమైనా ఇష్టంగా ఎక్కాడు. అనుకున్నట్లే ఎవరెస్ట్ శిఖరాన్ని అందుకున్నాడు. చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో తనకు తానే లిఖించుకున్నాడు. ఎవరెస్ట్ ఎక్కి పర్వతారోహకుల్లో ది బెస్ట్ అనిపించుకున్నాడు. అతడే టెంజింగ్ నార్గే.

ఎవరెస్ట్ మొట్టమొదట ఎక్కింది ఎవరంటే.. అందరూ చెప్పేది ఎడ్మండ్ హిల్లరీ పేరు. కాని తనతో పాటు ఎడ్మండే ఆ శిఖరానే టెంజింగ్ నార్గేనే. టెంజింగ్ లేకపోతే ఎడ్మండ్ పేరు చరిత్ర పేజీలకెక్కేది కాదు. టెంజింగ్ లేకుండా ఎవరెస్ట్ ఎక్కడం జరిగేదే కాదని స్వయంగా ఎడ్మండే తన పుస్తకంలో పేర్కొన్నారు. పర్వతాలు ఎక్కడమే తప్ప మిగతా విషయాలు అంతగా తెలియని టెంజింగ్‌కి ఫోటో ఎలా తీయాలో కూడా తెలియదు. అందుకే ఎవరెస్ట్ చరిత్రలో అతని

ఫోటోనే నిలిచింది. ఎవరెస్ట్ శిఖరంపై నిలబడ్డ ఎడ్మండ్ హిల్లరీ ఫోటో మాత్రం లేదు. హిల్లరీ టెంజింగ్ ఫోటో తీశాడు. కాని టెంజింగ్ ఎడ్మండ్ ఫోటో తీయలేకపోయాడు. తీయాలని ప్రయత్నించినా హిల్లరీ తల అడ్డంగా ఊపాడట.

అదే పుట్టిన రోజు

టెంజింగ్ నార్గే జీవితం హిమాలయాలతోనే పెనవేసుకుపోయింది.. అతనికి మరే విషయాలు పట్టలేదని. ఇండియాలోనే స్థిరపడ్డ నేపాలీ కుటుంబంలో టెంజింగ్ నార్గే పుట్టాడు. నేపాల్, టిబెట్ తదితర ప్రాంతాల్లో పెరిగాడు. మొత్తం మీద హిమాలయాలకు అనేక దిక్కుల్లోనే పెరిగాడు. అతను ఎక్కడున్నా ఒకవైపు ఈ పర్వతాలే ఉండేవి. ఎప్పుడు పుట్టాడో అతనికే సరిగా తెలియదు. వాతావరణాన్ని బట్టి మే నెల 1914లో పుట్టినట్లు ఒక అంచనా. కాని తన పుట్టినరోజు మాత్రం మే 29, 1953 అని టెంజింగ్ చెప్పేవాడు. ఎందుకంటే ఆ రోజే అతడు ఎవరెస్ట్ ఎక్కిన రోజు.

ఏమీ తోచని టెంజింగ్ టీనేజ్‌లో ఇంటి నుంచి రెండు మూడుసార్లు పారిపోయాడు. మొదట ఖాట్మండ్ ఆ తర్వాత డార్జిలింగ్‌కు పారిపోయి.. అక్కడే సెటిలైపోయాడు. నేపాలీ బుద్ధిజాన్ని ఫాలో అయ్యే నార్గే కుటుంబం అతడిని 20 ఏళ్ల వయసులోనే బౌద్ధ సన్యాసిగా మార్చింది. కాని మనోడి చూపంతా ఎవరెస్ట్‌పైనే ఉండేది. అందుకే ఆ సన్యాసి రూపం వదిలేసి.. పర్వతారోహణం చేసే ఓ బ్యాచ్ దగ్గర జాబ్ లో జాయినైపోయాడు. అతడి భాష అర్థం కాక ముందు వద్దన్నా.. కొండలనే ప్రేమగా చూస్తూ చిరునవ్వులు చిందిస్తూ ఉద్యోగం ఇచ్చేవరకు వెళ్లనని నిలబడ్డ అతన్ని చూసి ఎరిక్ షిప్టన్ అనే బ్రిటిషర్ ముచ్చటపడి.. జాబ్ ఇచ్చేశాడు.

ఎవరెస్ట్ దిశగా...

అలా టెంజింగ్ పర్వతారోహణ ప్రస్థానం మొదలైంది. బ్రిటీష్ ట్రూప్‌తో కలిసి మూడుసార్లు హిమాయాలను అధిరోహించాడు. కాని ఎవరెస్ట్ ఎక్కాలన్న అతని కోరిక తీరలేదు. ఈ మూడుసార్లు అతడు ఎక్కింది టిబెట్ వైపు ఉన్న హిమాలయాలనే. 1947లో చిత్రాల్ అనే ప్రాంతంలో కుటుంబంతో కలిసి ఉండేవాడు. దేశవిభజన జరగడంతో ఆ ప్రాంతం పాకిస్తాన్‌లో కలిసింది. అప్పటికే అతని భార్య చనిపోయింది. అక్కడి నుంచి తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని డార్జిలింగ్‌కు బయలుదేరాడు. టిక్కెట్ లేకుండా ట్రైన్ ఎక్కి తాను పని చేసిన బ్రిటీష్ ట్రూప్‌వారి మేజర్ డ్రెస్ వేసుకుని మేనేజ్ చేసి.. సరిహద్దు దాటేశాడు. డార్జిలింగ్‌కు చేరుకున్నాడు. బతకడానికి సాహసం చేశానని నార్గే అనుకున్నాడు. కాని ఆ సాహసం అతడిని ఎడ్మండ్ హిల్లరీకి కలుపుతుందని.. ఎవరెస్ట్ ఎక్కిస్తుందని ఊహించలేకపోయాడు.

ఒక్కో శిఖరం

1947లో టిబెట్‌కు అక్రమంగా సరిహద్దులు దాటి వెళ్లి మరీ.. కెనడీ ట్రూప్‌తో కలిసి 22 వేల అడుగుల ఎత్తు దాకా వెళ్లాడు. ఆ తర్వాత అదే సంవత్సరం స్విట్జర్లాండ్‌కు చెందిన వాంగ్డీతో కలిసి 22,769 అడుగుల ఎత్తుకు చేరాడు. తీవ్రంగా గాయపడ్డ వాంగ్డీని కాపాడి.. సురక్షితంగా కిందకు తీసుకురావడంతో.. టెంజింగ్ పేరు పర్వతారోహకుల్లో మార్మోగింది. 1952లో మరో స్విస్ ట్రూప్‌తో కలిసి 28,199 అడుగులు ఎక్కి కొత్త రికార్డు సృష్టించారు. ఎవరెస్ట్ ఎక్కడానికి సీరియస్‌గా ప్రయత్నించినా.. సఫలం కాలేదు. మరొకరితో కలిసి ఈసారి 28,200 అడుగుల దాకా ఎక్కాడు. కాని మంచు తుఫాను రావడంతో వెనక్కి రావాల్సి వచ్చింది. మరో 800 అడుగుల దూరంలో ఉండిపోయిన ఎవరెస్ట్‌ను టెంజింగ్ వదిలిపెట్టలేదు. 1953లో ఎడ్మండ్ హిల్లరీతో కలిసి చేసిన పర్వతారోహణం టెంజింగ్ నార్గేను ఎవరెస్ట్ శిఖరం ఎక్కించింది. 29028 అడుగుల ఎత్తున ఉన్న ఎవరెస్ట్‌ను ఎక్కి చరిత్ర సృష్టించారు వారిద్దరూ.

భారత ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. నేపాల్ రాజు కూడా సన్మానించాడు. డార్జిలింగ్‌లో పర్వతారోహకులకు ఇన్‌స్టిట్యూట్‌ను నార్గే తర్వాత కాలంలో నడిపించాడు. భూటాన్ రాజు పిలుపుతో అక్కడికి వెళ్లి పర్వతారోహకులకు గైడ్‌గా పని చేశాడు. 71 ఏళ్ల వయసులో డార్జిలింగ్‌లోనే 1986లో టెంజింగ్ నార్గే కన్ను మూశాడు. నేపాల్ ప్రభుత్వం 25,791 అడుగుల ఎత్తు ఉన్న పర్వతశ్రేణికి నార్గే పేరును పెట్టాలని 2013లో నిర్ణయించింది.

- జి. రవికిరణ్

మార్గదర్శి............ 1
అందనంత ఎత్తుకు
ప్రత్యేకం..............3
మీ కళ్లతో రాజస్థాన్
స్టార్.................. 4
నటనా నవాబ్
కార్టూన్ పంచ్......... 5
యువ................10
వాడిపోయిన పూలే పెట్టుబడి
తెలుసా...............11
ఇవీ పలకరింపులే..

ఇండెక్స్

కూ...ల్

అట్టమీది కథ.........6

నా కళ్ళతో
చైనాలో 'చక్రం' తిప్పి...
వింతలోకం...............14
'పచ్చ'టి ఇల్లు
స్ఫూర్తి...............16
ఫుట్‌పాత్ స్కూల్
కవిత్వమ్...............18
మీరా.. మా దేశభక్తిని శంకించేది!
కథ.....................20
తప్పుకి శిక్ష తప్పదు
బాలనేస్తాలు.............22
చిట్టి తాబేళ్ళు
పదవికాసం...............24

ఆకట్టుకున్న మరిగే నది

కొందరు ప్రపంచానికి తెలియని కొత్త విషయాలను పరిచయం చేస్తారు. మరి కొందరు సాహసాలను చేసి మరీ ఆశ్చర్యాన్ని కలిగించే విషయాల వెనుక దాగిన రహస్యాలను పసిగడుతుంటారు. మరిగే నదిని వెతుక్కుంటూ యాండ్రస్ చేసిన సాహసోపేతమైన ప్రయాణం నదిపై అతను చేసిన పరిశోధనలు ఆద్యంతం చదివించాయి. టైటానిక్ ప్రయాణంలో చివరి నిమిషంలో అందులోని వారు పడిన వేదనలు, అక్కడున్న వారిని కాపాడేందుకు కెప్టెన్ జాన్ స్మిత్ అంతిమంగా చెప్పిన విషయాలు ఆశ్చర్యానికి గురిచేశాయి. కుడికాలి వాటం బౌలర్ అమీర్ పట్టువదలని కృషి, ఢీ-20 ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న టీమ్ ఇండియా విశేషాలు ఆకట్టుకున్నాయి. ప్రపంచ ఖ్యాతి పొందిన నవలలు బాలీవుడ్ కథాబలంగా మారిన తీరు. ఉత్తరప్రదేశ్ లో వనితలు కట్నంపై తీసుకున్న మంచి నిర్ణయాల గురించి అందించిన వివరాలు ఆద్యంతం చదివించాయి.

ప్రియదర్శిని, నెల్లూరు

ఢీ-20

క్రికెట్ వీరాభిమానులు భారత్‌లో కోకొల్లలు. కొందరు ఎంత అవసరమైన పని వున్నా

క్రికెట్‌ని చూడడం మాత్రం మిస్సవరంటే భారత్‌లో క్రికెట్ క్రేజ్ ఎంతుందో అర్థమవుతుంది. అట్టమీది కథలో భారత పురుషుల క్రికెట్ టీమ్‌తో పాటుగా మహిళా జట్టు విజయ పరంపరలు, టీ-20 వివరాలు ఆద్యంతం చదివించాయి. సంగీత లోకంలో వచ్చిన గుర్తింపుని నిలబెట్టుకుంటూ అఫర్లని, కెరీర్‌ని మలుచుకున్న అనిరుధ్ జీవిత విశేషాలు, కథలు చెప్పకు కథ, అమ్మ వేసిన జడలు బాగున్నాయి.

రమణి, అనంతపురం

సేవాతత్పరత

విదేశాల్లో ఉద్యోగం వస్తే చాలు ఇక అక్కడే సెటిలవ్వాలని అనుకునే వాళ్లు చాలామందే. వారికి భిన్నంగా భారత్‌కి వచ్చి మెడికల్ యాత్రలు నిర్వహిస్తున్న మెడికల్ యాత్ర బృందం కృషి అభినందనీయం. కుడి కాలి వాటం బౌలర్, మరిగే నది, బాలీవుడ్ కథాబలం, గురువుదేవర కథ, అమ్మ వేసిన జడలు, మరిగే నది గురించి అందించిన వివరాలు ఆకట్టుకున్నాయి. టీచర్‌గా సెటిలైనా రైతుగా మారి ఆ గ్రామానికే ఆదర్శవంతంగా మారిన ప్రసన్న నేటితరానికి మార్గదర్శి. తెలుసాలో టైటానిక్ విశేషాలు, వింతలోకంలో ఉద్యోగం ఇప్పించండి, బట్టలుతికే సైకిల్, కార్టూన్ పంచ్‌లు బాగున్నాయి. అకట్టుకున్నాయి. వరకట్న పిశాచిని తరిమికొట్టేందుకు ఉత్తర ప్రదేశ్ సిద్ధార్థ్ నగర్‌లో వచ్చిన మార్పు ప్రతి చోట రావాలని కోరుకుంటున్నాం.

సీతారాం, కాకినాడ

మార్పు రావాలి

ఆడపిల్లలు వున్న ఇళ్లలో వారి ఆరోగ్యం, విద్య కంటే వారికి వివాహం ఎలా చేయాలా అని తెగ దిగులు పడుతుంటారు తల్లిదండ్రులు. పెళ్లి కానుకలుగా వేలకు వేలు ఇచ్చుకోలేక వేదన అనుభవించేవారు, అడపిల్లలను గుండె మీది కుంపటిగా భావించేవారు ఇప్పటికీ లేకపోలేదు. అలాంటి వారికి కనువిప్పు ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థ్ నగర్ గ్రామం. ఆ గ్రామస్తుల గురించి తెలుసుకునైనా సమాజంలో మార్పు రావాలి. బాలీవుడ్ కథాబలం, కొలవెరి డీ, మెడికల్ యాత్ర, అట్ట మీది కథ చదివించాయి. చల్లని జ్యూస్‌లు, నవ్వుల్-పువ్వుల్ జోక్స్ బాగున్నాయి.

పావని, తణుకు

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ప్రత్యేకం



మీ కళ్లతో రాజస్థాన్

ఒంటెలు, డేగలు, బారు మీసాలు... ఇంకా ఇసుక ఏం గుర్తొచ్చింది? రాజస్థాన్ కదా! అందుకే అవే లోగో అయ్యాయి రాజస్థాన్ పర్యాటకానికి. సైకత కళతో ఆవిష్కరించిన ఈ లోగోకిప్పుడు క్రేజ్ అంతా ఇంతా కాదు. రాజస్థాన్ దినోత్సవాన్ని పర్యాటకులతో కలసి ఇంతకు ముందు కన్నా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసేందుకు కొత్త ప్రకటనలు బూస్ట్ ఇచ్చాయి. ఎవరి కళ్లతో రాజస్థాన్ ఎలా కనిపిస్తుందో అంటూ అందరి పర్యాటక ప్రస్థానాన్ని ఇసుక తిన్నెల రాజ్యం పట్టించాయి.

"మాటి బాంధే పైంజానీ... బాంగ్డీ పెహ్నా బాద్‌లీ.. డేడో డేడో బావ్డో....ఘోథ్ మథోడ్ బావ్‌డీ.." ఇప్పుడు ఈ రింగ్‌టోన్ రాజస్థాన్‌లో హల్‌చల్ చేస్తోంది. స్థానికులే కాదు విదేశీ పర్యాటకులు కూడా ఈ జింగిల్‌ను వాడేస్తున్నారు. రాజస్థాన్ జానపదాలనే ఉపయోగించి అమర్ మంగ్రూల్‌కర్ హుషారెత్తించే సంగీతాన్ని అందించారు. పాపులర్ అవడమే కాదు రాజస్థాన్ పాపులారిటీని మరింత పెంచేశాయి ఈ "జానే క్యా దిఖ్ జాయే" యాడ్స్. ఇంతకీ ఈ జింగిల్‌కు అర్థమేమంటే "ఈ భూమి మువ్వలు కట్టుకుంది.. ఆకాశం గాజులు తొడుక్కుంది... మేఘాలు తన్మయంతో అనేక రూపాల్లో పరుగెడుతున్నాయి... ఓ అందమైన గుండ్రని భూమీ..!!" ఇంతకీ ఈ ప్రచారమంతా కూడా యువ పర్యాటకులను, సాహసికులను ఆకర్షించేందుకే. ఎడారి నేలపై అద్భుతంగా కట్టిన కోటలు, గుమ్మటాలు, కోనేర్లే కాక రాజస్థాన్‌లో ఇంకా చాలా విషయం వుంది. బిష్ణోయ్ లాంటి పర్యావరణ హిత సాంప్రదాయాలు, కామాచ్య వంటి జానపద తంత్రి వాద్యాల విరహ గీతాలు, ఘూమర్ సంతోష నృత్యాలు తదితరాలన్ని ప్రత్యేకాలే. ఈ యాడ్‌లను రూపొందించింది ఓగిల్వీ అండ్ మాథెర్ యాడ్ ఏజెన్సీ. సైకత కళతో ఆవిష్కరించిన లోగో ఓ హైలైట్ అయితే, ప్రచారానికి రూపొందించిన నాలుగు నేమిస్తాన్ కమర్షియల్స్ వేటికవే సాటి. 22 రాజపుత్ర సంస్థానాల విలీనంతో మార్చి 30, 1949లో రాజస్థాన్‌గా మారిన థార్ నేలకు పర్యాటకమే తిండి పెట్టేది. అందుకే దేశంలోని మిగతా రాష్ట్రాల కన్నా పర్యాటకానికి పెద్ద పీట వేస్తారక్కడ. సుమారు పాతికేళ్ల తర్వాత పర్యాటకానికి ఊపందించే కార్యక్రమాల్ని చేపట్టడానికి కారణం ఇంతకు ముందు దేశానికొచ్చే విదేశీయుల్లో 33 శాతం మందిని రాజస్థాన్ పంచుకునేది. కానీ ఇప్పుడది 20 శాతానికి పడిపోయింది. దేశీ పర్యాటకులు కూడా



మధ్యప్రదేశ్ వంటి డెస్టినేషన్లకు మారిపోతున్నారు. తిరిగి తన పర్యాటక రంగ ప్రాభవాన్ని నిలుపుకోవడానికి కొత్త యాడ్స్ బలాన్నిస్తున్నాయి. చరిత్రకు, కష్టతరమైన జీవనానికి, వైరుధ్యమైన సంస్కృతులకు, వర్ణశోభితమైన వేషకట్టుకు, ధీరుల మీస కట్టుకు, అమూల్యమైన పచ్చదనానికి, విస్తారమైన నారింజ ఇసుక రేణువులకు, అరుదైన జీవజాలానికి ప్రతీకగా రాజస్థాన్ ప్రచారానికి క్లాప్ కొట్టింది పీయూష్ పాండే బృందం. సైకత ప్రాజెక్ట్‌ను స్టాప్ మోషన్ పిక్చర్ టెక్నిక్‌తో రూపొందించారు క్రియేటివ్ డైరెక్టర్ సురేష్ ఎరియత్. 50 సెకన్ల ఈ యానిమేటెడ్ వీడియో ఓ అద్భుతం. స్టుడియో ఈక్వారస్ పాత్ర ఎక్కువే

నీ స్థాన్ నా స్థాన్ అట

యాడ్స్ చూస్తే జేనిస్థాన్, మీరాస్థాన్, హువాన్‌స్థాన్, బినయ్‌స్థాన్ అంటూ ఒక్కో పర్యాటకుడి కళ్లతో రాజస్థాన్ ఎలా కనబడుతుందో అలా ప్రెజెంట్ చేసి తమ సొంత స్థానమనే భావన కలిగించారు. అద్భుతమైన నేరేషన్‌తో సాగిపోయే కథనంలో అల్టిమేట్‌గా రాజస్థాన్ వైవిధ్యాన్ని, విలక్షణీయతను కళ్లకు కట్టారు. యూరప్ పర్యాటకులను ఉద్దేశించి తీసిన యాడ్‌లో థార్ ఎడారి ఇసుక తిన్నెల్ని హైలెట్ చేశారు. ఆరుగురు వెళ్లడానికి అనుకూలంగా ఉండేలా మార్పు చేర్పులు చేసిన బుల్లెటే ఇక్కడి జుగాడ్. ఎడారి మార్గమధ్యన ఒంటరైన యూరోపియన్లకు దాని మీద లిఫ్ట్ ఇచ్చేస్తారు బారుమీసాల బాబులు. చివరిలో జింగిల్‌తో ఆర్యాస్థాన్ తయారైంది. ఇక ఇసుక తప్ప రాజస్థాన్‌లో ఏముంటందనుకుంటూ సైకిల్ ప్రయాణం కట్టిన జేన్ జంటకు దారి చూపించే కుర్రాడు సరాసరి 'గరాడియా మహాదేవ్'ను భూలోక స్వర్గంగా చూపించే వ్యూపాయింట్‌కు చేరుస్తాడు. అదే జేనిస్థాన్. ఇక మీరాస్థాన్‌కు వస్తే మన బంగారు తల్లి బుజ్జి మీరాను హాట్ ఎయిర్ బెలూన్ ఎక్కిస్తారు. మేఘ విహారంలో అంత పెద్ద బెలూన్ కాస్త తానాడుకునే బుడగల గుంపుగా కనిపిస్తుంది ఆ చిన్నారికి. చైనా పర్యాటకులను ఆకట్టుకునేందుకు తీసిన హువాన్‌స్థాన్‌లో ఉదయ్‌పూర్‌లోని కుంభాల్‌ఘడ్ కోటను పరిచయం చేస్తారు. వారక్కడ కట్టుకున్న చైనా గోడలా బారుతీరిన కోట ప్రహరీని చూసి లోకల్ ఫీల్ హువాన్‌కు కలిగినట్టు కొట్టొచ్చినట్టు ఆమె రియాక్షన్‌లో పట్టారు. సాహసం చేసేయాలని ఉవ్విళ్లూరే కుర్రకారు రహస్య హంట్‌ను డ్రా చేసేశారు బినోయ్‌స్థాన్‌లో. బినయ్ తన స్నేహితుడితో కలసి జైసల్మేర్‌లోని ఒక్క రాత్రిలో మాయమైన గ్రామస్తుల ప్రాంతం కుల్‌ధారాలో రాత్రిన అడుగుపెడతాడు. అలాంటి సాహసికులే అయిన మరో ఇద్దరు యువతులు అక్కడ ప్రత్యక్షమైతే జడుసుకుంటారు. తర్వాత ఇప్పటి తరం ఇన్‌స్టంట్ స్నేహంతో కథ ముగుస్తుంది.

- జే

స్టార్

నటనా నవాబ్

లంచ్ బాక్స్, గ్యాంగ్స్ ఆఫ్ వస్సీపూర్, బదలాపూర్, తలాష్, కహానీ, భజరంగీ భాయ్‌జాన్, మాన్‌సూన్ షూటౌట్, లయర్స్ డైస్ చిత్రాల్లో ఓ నటుడి పాత్రలు మరీ వాడిగా ఉంటాయి. పాత్రల్ని బట్టి నటుడా? నటుడి వల్ల పాత్రలా? తేల్చుకోనంతకా జీవం ఒలికిపోయింది. హిందీ సినీ పరిశ్రమలో కేరక్టరైజేషన్ శైలికి స్టార్‌డమ్ తెచ్చిన ఆ నటుడే నవాజుద్దీన్ సిద్ధిఖీ. ప్రేయసి కోసం రెండు చేతులతో కొండల్ని పిండి చేసిన దశరథ్ మాంఝీ పాత్రలో వచ్చిన 'మాంఝీ' చిత్రం ఈనటనా నవాబ్...నవాజ్‌దే.

- ఉమ్మడి కుటుంబంలోని తొమ్మిది మంది పిల్లల్లో పెద్దవాడైనా మహా తుంటరోడు నవాజ్. మిగతావారిని అనుకరిస్తూ తెగ నటించేవాడు. ఇంటి పెద్ద గొంతును మిమిక్రీ చేసి పిల్లల్ని బెదరగొట్టేవాడు.
- ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ దగ్గరలోని బుధన నవాజ్ సొంతూరు. నవాజ్ చిన్నతనంలో ఆ ఊళ్లో టీవీ అంటే ఏమిటో తెలీదు. వీధి నాటకాలు, గ్రామ సంబరాలే వినోదం.
- సినిమాకు వెళ్లాలంటే 45 కి.మీ. దూరం ప్రయాణం చేయాలి. చిన్నతనమంతా కలిపి ఓ 5 సినిమాలు కూడా చూసి ఉండడు.
- ప్రేక్షకుల్ని నవ్విస్తూ, అంతలోనే వాళ్ల కళ్లంట కన్నీళ్లు తెప్పిస్తూ, ఇంతలోనే హుషారు పెంచుతూ అందరిని నటనతో కట్టిపడేసే రంగస్థల నటుల్లా తాను కావాలనుకున్నాడు. కానీ అప్పటికీ సినిమా అంటే సరిగా తెలీదు.



- హరిద్వార్‌లోని గురుకుల్ కాంగ్రి విశ్వవిద్యాలయంలో సైన్స్ పట్టా చేతికొచ్చాక కెమిస్ట్‌గా ఓ ఏడాదిపాటు ఓ పెట్రోకెమికల్ కంపెనీలో పనిచేశాడు. పరిస్థితుల వల్ల వాచ్‌మెన్‌గాను మారాడు.
- అప్పుడే తాను ఇంకేదో చేయాల్సి ఉందనే ఆలోచన పదే పదే విసిగించేది. వాచ్‌మెన్‌గా చేస్తూనే తనని సతాయిస్తున్న ఆలోచనకు ఉపశమనంగా ఓ చిన్న రంగస్థల జట్టులో చేరాడు.
- ఆ సమయంలోనే నిర్ణయించేసుకున్నాడు బతికి ఉంటే నటుడిగానే లేకుంటే చావేనని. వెంటనే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో శిక్షణకు వెళ్లాడు.
- అవకాశాలు వెతుక్కుంటూ 2004లో ముంబై చేరాక అన్ని విసురుగా తగులుతున్న రాళ్ల దెబ్బలే. వాటినే పోగేసుకుని తన విజయానికి మెట్లు కట్టుకున్నాడు నవాజ్.
- పిన్నవయసులోనే వివాహమయినా తన కల కోసం భార్యను వారి గ్రామంలో విడిచి ముంబైలో ఒక్కడే ఉండేవాడు. సినిమాల్లో నిలదొక్కుకున్నాక అంజలి (భార్య)తో కలసి ముంబైకు మకాం మార్చాడు. వారికో కూతురు పుట్టింది. అప్పుడు నవాజ్ వయసు 41 ఏళ్లు.
- మరో ఆసక్తికరమైన విషయమేమంటే 'మిస్ లవ్‌లీ' చిత్రంలో హీరోయిన్‌తో ముద్దు సన్నివేశం ఉంటుంది. అప్పటి వరకు భార్య బుగ్గను కూడా చుంబించలేదు నవాజ్. షూటింగ్‌లో చాలా ఇబ్బంది పడ్డాడట.
- పాత్ర నిడివి ఎంత ఉంటుందనేది కాదు నవాజ్ ఎంచుకునే ఆ పాత్ర ఎంత ప్రభావవంతంగా విలక్షణంగా ఉంటుందనేదే ముఖ్యం.
- 1999లో వచ్చిన అమీర్ ఖాన్ నటించిన సర్ఫరోష్ చిత్రంలో ఓ వెయిటర్‌గా జస్ట్ అలా కనిపించే పాత్ర తొలి అవకాశం.
- ఓ సీనియర్ రంగస్థల నటుడికి వంట పనిచేస్తూ రూమ్‌లో ఆశ్రయం పొందిన నవాజ్‌కు టీవీ సీరియళ్లలోను అవకాశాలు వచ్చేవి కావు.
- 2003లో మరో విలక్షణ నటుడు ఇర్ఫాన్ ఖాన్‌తో కలసి ఓ షార్ట్ ఫిల్మ్ తీసి అందులో కనిపించాడు.
- అలా ఏళ్లపాటు ఆకలిగొన్న నవాజ్‌కు అనురాగ్ కశ్యప్ 'బ్లాక్ ఫ్రైడే' (2007)లో ఓ పవర్‌ఫుల్ పాత్ర లభించింది.
- 2007-08లో వచ్చిన మనోజ్ భార్గవ 'పతంగ్' సినిమాలో పెళ్లిళ్ల గాయకుడు చక్కు పాత్రతో బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రశంసలు దక్కించుకున్నాడు నవాజ్. అంతర్జాతీయ చిత్ర విమర్శకుడు రోజర్ ఎబెర్ట్ మెప్పు పొంది నట పరిశ్రమలో హాట్ టాపిక్ అయ్యాడు.
- 2012లో అమీర్ ఖాన్ చిత్రం 'పీప్లీ లైవ్'లో జర్నలిస్టు పాత్రతో మంచి గుర్తింపు లభించింది. అది మొదలు కహానీ, మిస్ లవ్‌లీ, గ్యాంగ్స్ ఆఫ్ వస్సీపూర్, ఆత్మ, తలాష్ చిత్రాలతో అతడి స్పీడ్ పెరిగింది.
- హరామ్‌ఖోర్ అనే మరాఠీ చిత్రంలో నటనకు గాను న్యూయార్క్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఉత్తమ నటుడి పురస్కారం దక్కించుకున్నాడు.
- 11 ఏళ్ల విశ్రమించని బతుకు పోరాటంలో చివరకు తానను‌కున్నది సాధించిన నవాజ్‌కు పొగడ్తలంటే చాలా కష్టం.
- నసీరుద్దీన్ షా, అమితాబ్ బచ్చన్, ఆశీష్ విద్యార్థిలది నటనంటే అనే నవాజ్ నటన చూస్తే రాబోయే జనరేషన్ అతణ్ని కూడా ఆ లిస్ట్‌లో చేరుస్తుంది.

కార్టూన్ పంచ్



నవ్వుల్- పువ్వుల్

పది రూపాయలు

డాడీ: ఒరే వంశీ నువ్వు నా జేబులో పది రూపాయలు దొంగిలిస్తున్నప్పుడు నీ అంతరాత్మ అది తప్పని చెప్పలేదా?



చందు: చెప్పింది డాడీ. కానీ చెప్పుడు మాటలు వినవద్దని నువ్వే చెప్పావు కదా డాడీ.

పరీక్ష

చింటూ పరీక్ష హాలులో కూర్చుని దిక్కులు చూస్తున్నాడు..

టీచర్: ఏం చింటూ చాలా బాధగా వున్నట్టున్నావ్?

చింటూ: ఏమీ జవాబు చెప్పకుండా సైలెంట్‌గా కూర్చున్నాడు.

టీచర్: ఏంటీ, పెన్ను మర్చిపోయి వచ్చావా?

మళ్ళీ సైలెంటే...

టీచర్: ఏంటీ, రోల్ నెంబర్ కానీ మర్చిపోయావా?

చింటూ: లేదు టీచర్... రేపటి పరీక్ష స్లిప్పులు పొరపాటున ఇవాళే తెచ్చేశా. అందుకే ఆ బాధ.

దూకలేడు..ఎలా?

"హలో మా ఆయన కిటికీలోంచి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధమయ్యాడు".
హోటల్ గది నుంచి రిసెప్షన్‌కు ఫోన్ చేసింది ఓ మహిళ.
"కంగారు పడకండి మేడమ్
మీ ఆయన ఆ అఘాయిత్యం చేసుకోకుండా మేం కాపాడుతాం" భరోసా ఇచ్చాడు రిసెప్షనిస్ట్.
" నీకు ఫోన్ చేసింది కాపాడటానికి కాదురా నాయనా..
కిటికీ తెరుచుకోవడం లేదేమిటని అడగటానికి" విరుచుకుపడింది మహిళ.

కూ...ల్

వేసవి మళ్లీ వచ్చింది. వస్తూ వస్తూ తనతో పాటు తన మిత్రులనూ వెంటేసుకొచ్చింది. అవేనండి! వేడిగాలులు, వడదెబ్బ, అతిదాహం, అలసట, నీరసం. అలానే పుల్లటి మామిడి రుచులు, చల్లదనాన్నిచ్చే తాటి ముంజలు, పరిమళాలను వెదజల్లే మరు మల్లెలూ అన్నీ వేసవిలో మాత్రమే లభించే అనుభూతులు. వేసవి ఎండలు మండిస్తున్నాయంటూ నిట్టూరుస్తూ ఎండలకు భయపడుతూ ఇంట్లోనే కూర్చోవాల్సిన పనిలేదు. ఆహారం, నీరు, వస్త్ర ధారణ, జీవనశైలిలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే రకరకాల సలాడ్‌లు, పళ్లరసాలను హాయిగా ఆస్వాదిస్తూ.. ఆహ్లాదంగా విహార యాత్రలు చేస్తూ ఈ వేసవి సెలవులను ఆనందోత్సాహాలతో గడపొచ్చు.

- అద్దేపల్లి శర్వాణి

బయట తిరిగితేనే ఎండ ఒంట్లో నీటిని, శక్తిని స్ట్రా వేసి తాగేస్తుందని అనుకుంటే పొరపాటే. ఇంట్లో ఉన్నా కూడా విపరీతమైన ఉక్కపోతతో సారాన్నంతా కోల్పోతాం. ఫ్యాన్‌లేస్తే వేడిగాలి, కిటికీలు తెరుద్దామంటే వడగాలి.. మనకు చెమట పట్టకుండా ఉండే చాన్సే లేకుండా చేస్తాయి. ఇలా ఒంట్లో నీరంతా పోతే అది ప్రాణాల మీదకు తెస్తుంది. శరీరంలోని నీటి శాతం తగ్గడం వల్ల డీహైడ్రేషన్‌కి గురవుతారు. పిల్లలు, వృద్ధులు డీహైడ్రేషన్‌కి ఎక్కువగా గురవుతుంటారు. అధిక దాహం, నాలుక పిడచకట్టుకుపోవడం, కళ్లు లోపలికి పోవడం, నీరసం వంటివి డీహైడ్రేషన్ లక్షణాలు. వీటిని త్వరగా గుర్తించకపోతే ప్రాణాపాయం కూడా తప్పదు. డీహైడ్రేషన్ నుండి బైటపడేందుకు ఇంట్లో ఎలక్ట్రాల్ పౌడర్, గ్లూకోజ్, వంటివి తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలి. డీహైడ్రేషన్‌కి గురైన వారికి కొందరు ఓఆర్ఎస్ ప్యాకెట్స్‌ని కత్తిరించి రెండు మూడు చెంచాలు నీటిలో కలిపి ఇస్తుంటారు. ఇలా చేయడం వల్ల అందులో ఉండే లవణాలు అన్నీ వారికి అందవు. ఒక లీటర్ నీటిలో ఒక ప్యాకెట్ పౌడర్ మొత్తాన్నీ కలిపి 24 గంటలలోపు ఈ ద్రావణాన్ని కొద్ది కొద్దిగా తాగించడం వల్ల ఫలితం ఉంటుంది.

వడదెబ్బ తగలకుండా..

వేసవిలో బయటికి వెళ్లాలంటే చాలు అమ్మో వడదెబ్బ కొడుతుందిరా అంటూ అందరూ భయపడిపోతుంటారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా శరీరంలోని నీటిని, లవణాలను కోల్పోవడం వల్ల నిస్సత్తువ ఏర్పడి వడదెబ్బకు గురౌతుంటారు. సాధారణంగా 40 డిగ్రీల సెల్సియస్ లేదా అంత కంటే ఎక్కువ ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల వడదెబ్బ తగులుతుంది. పెద్దవారు, చిన్నపిల్లలు త్వరగా వడదెబ్బకు గురవుతుంటారు. దీన్నుండి తప్పించుకోవాలంటే..

- బయటికి వెళ్లేప్పుడు మనతోపాటు వాటర్ బాటిల్‌ని తప్పని సరిగా ఉంచుకోవాలి.
- దాహం వేసినప్పుడు మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు తగినన్ని నీరు తీసుకుంటుండాలి.
- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగా, చల్లగా ఉన్న ప్రాంతంలోకి చేర్చి పడుకోపెట్టాలి.
- శరీరానికి బాగా గాలి తగలడం

ఎంతో అవసరం. వంటిపై అధికంగా ఉన్న దుస్తులను తొలగించి గాలి తగిలేలా చేయాలి.

- ఐసు ముక్కలతో వంటిని చల్లబరిచే ప్రయత్నం చేయాలి.
- తగినన్ని ఎలక్ట్రోలైట్‌లు శరీరానికి అందేలా తరచుగా ఓ.ఆర్.ఎస్. పౌడర్, ఎలక్ట్రాల్ పౌడర్ వంటి ద్రవాలను అందిస్తుండాలి.
- జలుబు, జ్వరాలు వచ్చినప్పుడు మందుల షాపులో మందులు తెచ్చుకుని వేసుకున్నట్టు వడదెబ్బకి కూడా ఏదో ఓ మందు వాడేయడం మంచిది కాదు.
- వడదెబ్బకు వైద్యం మనకి తోచినట్టు కాకుండా వెంటనే డాక్టరు సహాయం తీసుకోవడం మంచిది.

లైట్‌గా తీసుకోండి

ఎప్పటిలాగే వేపుళ్ళు, చిరుతిళ్లతో పొట్ట నింపేసుకుందామంటే వేసవిలో చెల్లదు. ఎందుకంటే వేసవిలో శరీరానికి అవసరమయ్యే అధిక నీరుని అందించటం ఈ ఆహార పదార్థాలతో సాధ్యపడదు. అందుకోసం రోజువారీ వంటకాల్లోనూ ప్రత్యేక మార్పులను చేసుకోవాలి. తేలికపాటి ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. అది కూడా రసం ఎక్కువున్నవి, నూనె తక్కువున్నవి ఎంచుకుంటే మంచిది. తేలిగ్గా జీర్ణమయ్యే పదార్థాలు, పోషకాలను, ఖనిజ లవణాలను ఎక్కువగా అందించే కాయగూరలు, పండ్లు, ఫలాలను తీసుకోవాలి. నీరులానే ఆహారాన్ని కూడా ఎక్కువ విడతల్లో తీసుకుంటే మేలు. త్వరగా శక్తినిచ్చే అరటి పళ్ళు తప్పకుండా తీసుకోవాలి. సీజనల్‌గా లభించే పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు, కీరా దోస వంటి వాటిని తరచూ తీసుకుంటుండాలి. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల తగినంత నీరుతోపాటు శరీరానికి కావాల్సిన ఎలక్ట్రోలైట్స్ కూడా అందుతాయి. ఈ

సీజన్‌లో లభించే పళ్ళన్నిటినీ నేరుగా గానీ జ్యూస్‌ల రూపంలో కానీ తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతల్ని నియంత్రణలో ఉంచి శరీరానికి కావాల్సిన పోషకాలను అందిస్తాయి. కూల్‌డ్రింక్స్‌లో ఉండే సోడియం, అధిక షుగర్ వల్ల దాహం మరింత ఎక్కువవుతుంది. పోషకాలు కూడా ఉండవు కాబట్టి వీటిని అధికంగా తీసుకోవడం వల్ల సమస్యలు అధికమౌతాయి.

- పీచుపదార్థాలు ఎక్కువగా వుండే బీరకాయలు, పొట్లకాయ, సొరకాయ, ఆకుకూరలు, పప్పుతో మెనూ సిద్ధం చేసుకోండి.
- రసం, సాంబార్, సూపులను ఒక పూట ఆహారంలో చేర్చడం ద్వారా ఆహార సమతుల్యత కూడా ఏర్పడుతుంది.
- పెరుగు, ఉల్లిపాయలను ఆహారంలో తప్పనిసరిగా చేర్చాలి.
- ఆహారం ఎప్పుడు తీసుకున్నా ఒక గ్లాసు మజ్జిగ తీసుకోవడం వల్ల శరీరానికి చలవ చేస్తుంది.
- ద్రాక్ష, దానిమ్మ పళ్ళు, రాగి, బార్లీ జావలు ఎక్కువగా తీసుకోవాలి.
- ఎండుద్రాక్ష, ఖర్జూరలతో నానబెట్టిన నీటిని తీసుకోవడం ఉపయోగకరం.
- వేసవిలో మత్తు పానీయాలు, కాఫీ, టీలు కూల్ డ్రింక్స్ జోలికి పోకుండా వుండటం మంచిది.

చర్మం పదిలంగా...

ఎండాకాలంలో మన చర్మం వేడిమికి నేరుగా ప్రభావితమవుతుంది. అధిక ఉష్ణోగ్రత, రేడియేషన్ కలిగిన సూర్యకిరణాలు చర్మానికి అనేక సమస్యలను తెచ్చిపెడతాయి. సూర్యకాంతిలో ఉండే అతినీలలోహిత కిరణాలు (యు.వి) నేరుగా శరీరంపై పడటం వల్ల చర్మ కణజాలం, మెలనిన్‌లపై ప్రభావం చూపుతాయి. దీని కారణంగా చర్మం త్వరగా నల్లబడటం, దద్దుర్లు, చెమట కాయలు రావడం, మృదుత్వం కోల్పోవటమే కాకుండా చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం కూడా ఉంది. మన

తాగే నీటికీ ఓ లెక్కుంది

వేసవిలో నోరు ఎక్కువగా పిడచకడుతూ ఉంటుంది. ఎండలో నుండి ఇంటికి రాగానే కొందరు ఫ్రిజ్‌లోని చల్లని నీరు తాగేస్తుంటారు. అలా చేయడం వల్ల ఆరోగ్యానికి హాని తప్పదు. ఫ్రిజ్ వాటర్‌కి బదులుగా మట్టికుండల్లో వుంచిన నీటిని తాగడం వల్ల వేసవి తాపం తగ్గడమే కాదు ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అశ్రద్ధ చేయకుండా నీటిని అధికంగా తీసుకుంటుండాలి. వేసవిలో రోజుకు 8 గ్లాసుల కంటే ఎక్కువ నీరు మన శరీరానికి అవసరమవుతుంది. ఈ నీరంతటినీ తాగు నీటి రూపంలోనే నేరుగా తీసుకోవాల్సిన అవసరం లేదు. అలాగే నీటిని ఒక్కసారిగా త్వర త్వరగా తాగేయాల్సిన అవసరమూ లేదు. మనం చేసే పనిని బట్టీ అవసరాన్నీ బట్టీ నీటిని ఎలక్ట్రోలైట్, గ్లూకోజ్‌లతో పాటుగానీ నిమ్మరసం రూపంలో కానీ, సబ్జా, బార్లీ, కొబ్బరి నీళ్ల రూపంలోగానీ తీసుకుంటుంటే సరిపోతుంది. మనం చేసే కొన్ని పనుల తర్వాత కొద్ది కొద్దిగా నీటిని తీసుకుంటూ ఉండాలి.

- పరగడుపున 4 గ్లాసుల నీటిని తీసుకోవడం ఎంతో మంచిది.
- నడక, వ్యాయామం చేసిన అరగంట తర్వాత మరో 2 గ్లాసుల నీటిని తీసుకోవచ్చు.
- మధ్యాహ్న భోజనానికి ముందు 1 గ్లాసు నీటిని తీసుకోవాలి.
- స్నానానికి ముందు ఓ గ్లాస్ నీరు తాగితే రక్తపోటు తగ్గుతుంది.
- రాత్రి నిద్రపోయే ముందు గ్లాసు నీరు తీసుకోవడం ఎంతో మంచిది.
- అధిక శారీరక శ్రమ చేసే వారు 2-2.5 లీటర్ల నీటిని అధికంగా తీసుకోవాలి.



శరీరానికి నేరుగా ఎండ తగలడం వల్ల ఎలాస్టిన్, కొల్లాజెన్ కణాల సంఖ్య తగ్గి అనేక చర్మ సమస్యలు పుట్టుకొస్తాయి. వేసవి కాలంలో చెమట ఇంకిపోకుండా వుండటం వల్ల ఆ తడంతా శరీరంపై అలాగే నిలిచిపోవడం వల్ల చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. చర్మం మూసుకుపోయిన చోట చెమట కాయలు ఏర్పడతాయి. ఇవి రాపిడికి గురైనప్పుడల్లా, మంట, దురద, వాపు వస్తాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లకు దారితీస్తాయి. ఇన్‌ఫెక్షన్ ఏర్పడిన ప్రదేశాల్లో ఫంగస్ ఎక్కువవుతుంది. కొందరిలో సెగ్గడ్డలు కూడా వస్తుంటాయి.

- బయటికి వెళ్లే ముందు, ప్రతి రెండు గంటలకోసారి సన్‌స్క్రీన్ లోషన్ వాడడం వల్ల చర్మం పొడి బారిపోకుండా ఉంటుంది.
- సమయం దొరికినప్పుడల్లా నీళ్లతో మొఖం, పాదాలు, చేతులను శుభ్రపరుచుకుంటుండాలి.
- మామిడి తీసుకోవడం వల్ల సెగ్గడ్డలు ఏర్పడతాయనేది అపోహ మాత్రమే.
- ఈ సమయంలోనే వంటికి చలవ చేసే పదార్థాలను, మామిడి పండ్లను తీసుకోవాలి.
- మామిడి పండ్లలో ఉండే బీటాకెరోటిన్ అనే పదార్థం సెగ్గడ్డలు, చెమటకాయలు, దురదలు రాకుండా కాపాడుతుంది.
- కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, మొలకెత్తిన ధాన్యాలు, టమాటా, క్యారెట్‌తో పాటుగా ఎక్కువగా మజ్జిగ తీసుకుంటూ ఉండాలి.
- శరీరాన్ని రోజూ శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వేసవిలో వచ్చే సెగ్గడ్డలు, దురదలు, చెమట కాయల నుండి ఉపశమనం పొందొచ్చు.

కురుల సిరికి

వేసవి తాపాన్ని పోగొట్టుకునేందుకు కొందరు ఎక్కువగా తలస్నానాన్ని చేస్తుంటారు. చాలామంది స్విమ్మింగ్‌కి వెళుతుంటారు. జుట్టుకు ఎలాంటి రక్షణా లేకుండా ఎక్కువ సేపు నానేలా స్విమ్మింగ్ చేయడం వల్ల చుండ్రు పెరిగే ప్రమాదం ఉంది. తలస్నానం తర్వాత తలను పొడి టవల్‌తో శుభ్రంగా తుడుచుకోవాలి. కేశాలకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే చుండ్రు సమస్య అధికమవుతుంది.

చిన్న మాట

వేసవి సెలవులు వస్తున్నాయంటే చాలు చిన్న పిల్లల కేరింతలకు, చిలిపి పనులకు కొదవే వుండదు. ఇక సాయంత్రాలు పార్కులకీ, షికారుకీ వెళ్లేప్పుడు పిల్లలు ఎక్కువగా చిరుతిళ్లను కోరుతుంటారు. రోడ్డు పక్కన అమ్మే ఐసు, జ్యూస్, చెరుకు రసాలను కొనివ్వమని పేచీ పెడుతుంటారు. చెరుకు రసం, జ్యూస్‌లు చల్లదనాన్ని అందించేవైనా, వాటిని తయారుచేసే ప్రదేశాలు పరిశుభ్రంగా లేకపోయినా, వాటిలో వాడే పదార్థాలు నాణ్యమైనవి కాకపోయినా పిల్లలు త్వరగా వ్యాధుల బారిన పడతారు.

- సాధ్యమైనంత వరకూ పిల్లలకు బైట వస్తువులు కొనివ్వకుండా ఇంట్లోనే వివిధ రకాల పానీయాలను తయారు చేసి అందివ్వాలి.
- ఈ సీజన్‌లో ముఖ్యంగా చిన్న పిల్లల్లో చర్మ సమస్యల ప్రమాదం వుంది.
- పిల్లలు ఆడుకునేందుకు వెళ్లేప్పుడు తప్పనిసరిగా చెమట ఇంకే వస్త్రాలను వేయడం ద్వారా అలాంటి సమస్యలను తగ్గించుకోవచ్చు.
- గర్భిణులు త్వరగా అలసటకి గురవుతుంటారు. పుస్తకాలు చదవడం, మంచి సంగీతం వినడం, మెడిటేషన్ వంటివి అలసట, చిరాకు, ఆందోళనలను తగ్గిస్తాయి.
- వేసవి తాపాన్ని తట్టుకునేందుకు గర్భిణులు ఆహారంలో ఎక్కువగా దోసకాయలను తీసుకోవాలి.
- తగినంత వ్యాయామం, సాయంసమయంలో నడక, స్విమ్మింగ్ వంటివి వేడి నుండి ఉపశమనాన్ని అందిస్తాయి.

ఇంటికి గొడుగు పట్టండి

ఎండా కాలం వచ్చిందంటే అదే పనిగా కూలర్‌లు, ఏసీలను వాడేస్తుంటాం! వీటినలా ఎక్కువగా వాడేయడం వల్ల విద్యుత్తు ఎక్కువగా వృధా అవడమే కాక వాటి వల్ల మరింత వేడి పెరుగుతుంది. ఎండ ఎక్కువగా ఉందని ఉదయం పూట కిటికీలు, తలుపులు తెరిచి ఉంచాలి. అలా చేయడం వల్ల తగినంతగా గాలి ప్రవేశించి ఇంటిని చల్లబరుస్తుంది.



ఇలా అడుగేస్తే..

వేసవిలోనూ బయటికెళ్లడం తప్పదు. పరీక్షలకు బయల్దేరే విద్యార్థులు, పొట్ట కూటి కోసం పనికెళ్లే శ్రమజీవులకు బయటకు అడుగేయనిదే కుదరదు. వీరే ఎక్కువగా వడదెబ్బ తాకిడికి గురవుతారు. పనివేళల్లో మార్పులు చేసే అవకాశం ఉంటే మంచిదే. కానీ కార్మికులు, ఇతర ఉద్యోగులకు వానొచ్చినా, వరదొచ్చినా డ్యూటీ చేయాల్సిందేనన్నట్టు పరిస్థితి, బాధ్యతలుంటే ఇక ఎండల గురించి పనులెలా వాయిదా వేసే అవకాశం ఉంటుంది. అందుకే వీలయ్యే జాగ్రత్తలు పాటిస్తే కాస్తోకూస్తో ఎండ దాడికి విరామం ఇవ్వొచ్చు.

- ఎండ ప్రభావం ఎక్కువ కాకముందే ఇంట్లో నుండి బయట పడటం మంచిది. తప్పనిసరిగా వెంట ఓ గొడుగు తీసుకెళ్లాలి.
- ఎండలెక్కువగా వున్నపుడు ఉదయం 10 నుండి సాయంత్రం 4 గంటల మధ్య బయటికి వెళ్లకపోవడం మంచిదనేది డాక్టర్ల సూచన.
- తప్పనిసరై మధ్యాహ్నాలు బయటికెళ్లేటప్పుడు టోపీ/తలపాగ, కూలింగ్ గ్లాసెస్ వంటివి ధరించాలి. వీటిని ధరించడం వల్ల కళ్లకు ఎండ నుండి రక్షణ లభిస్తుంది. చెవుల్లోకి వేడి గాలి వెళ్లకుండా రుమాల్ కట్టుకోవడం మంచిదే.
- వాటర్ బాటిల్ కూడా తప్పనిసరిగా మన వెంట వుంచుకోవాలి.
- అధికంగా ఆభరణాలను ధరించడం వల్ల ఎలర్జీలు వచ్చే ప్రమాదం వుంది.
- ఎండలో బయటికి వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్ లోషన్‌ని తప్పనిసరిగా వాడటం మంచిది.

◆ ఎండ ఎక్కువగా వుండే మధ్యాహ్న సమయంలో తప్పనిసరిగా తలుపులను మూసివుంచాలి.

◆ ఇంట్లోకి వేడి గాలి జొరబడకుండా వట్టివేర్ల చాపలు, వెదురు, నార, కొబ్బరి పీచుతో తయారు చేసే తెరచాపలను ఉపయోగించడం మంచిది.

◆ ఎ.సి.కి బదులుగా సీలింగ్ ఫ్యాన్‌ను ఉపయోగించడం వల్ల గాలి ఒక చోటే వుండకుండా ఇంటిని చల్లబరుస్తుంది. విద్యుత్తును కూడా ఆదా చేస్తుంది.

◆ ఇంటి పరిసరాల్లో చల్లదనాన్నిచ్చే మొక్కలను వేసవికి ముందే నాటడం వల్ల వేసవి నాటికి ఎదిగి వేడి నుండి కాపాడతాయి.

◆ పగలంతా ఎ.సి. గదుల్లో మగ్గినా, సాయంత్రాలు పచ్చని చెట్లగాలిని తీసుకోవడం వల్ల శరీరానికి తగినంత ఆక్సిజన్ అంది వేసవి రోగాల బారిన పడకుండా ఉంటాం.

పెట్‌లనీ పట్టించుకోవాలి

చాలా మంది ఇళ్లలో పెంపుడు జంతువులు ఉంటూనే ఉంటాయి. కొందరు పక్షులను ఇష్టంగా పెంచుకుంటుంటారు. మనుషుల కన్నా బయట వుండే జంతువులు, పక్షులకు గ్రహింపు శక్తి ఎక్కువగా వుండటం వల్ల ప్రకృతిలోని మార్పులని అవి త్వరగా గ్రహించి తగిన జాగ్రత్తలు తీసుకుంటుంటాయి. వాటికి ఆసరాగా మనమూ కుదిరితే ఓ నీటి సదుపాయాన్ని, నీడపట్టును కల్పిస్తే వాటి కష్టం తగ్గుతుంది. ముఖ్యంగా పక్షులకు నీటి జాడనేది ఎండాకాలంలో దొరకదు. వాటి దాహార్తిని తీర్చేందుకు పాత్రల్లో నీటిని పట్టి అవి వాలేందుకు వీలుగా ఉండే ఇంటి పరిసరాల్లోనో, వీధుల్లోని ఖాళీ స్థలాల్లోనే రోజు ఉంచితే చాలా మేలు చేసినవాళ్లవుతారు. మొక్కలు, చెట్ల గురించి కాస్త తీరుబడి చేసుకోవాల్సిందే. నీటిలో వాటికి వాటా ఉంది. ఇంట్లో పెంచుకునే పెంపుడు జంతువులు కొంత వాటి సహజస్థితిని కోల్పోతాయి కాబట్టి వేసవిలో వాటిని మరింత జాగ్రత్తగా చూసుకోవాలి.

◆ సున్నితంగా వుండే ఈ జంతువులకు ఎక్కువ వేడి తగలకుండా చల్లని వాతావరణంలో ఉంచాలి

కాటన్‌లో లేతగా..

అన్ని సీజన్స్‌లో ఎలాగూ మనకిష్టమైన రకరకాల వస్త్రాలను ధరిస్తుంటాం. వేసవిలో మాత్రం ప్రత్యేకించి దుస్తులపై శ్రద్ధ తీసుకోవడం ఎంతో అవసరం. శరీరానికి ఎక్కువగా గాలి తగిలేలా వదులుగా వండే కాటన్ దుస్తులను ధరించడం మంచిది. చెమట ఇంకని బిగుతైన వస్త్రాలు, పాలిస్టర్, సింథటిక్ వస్త్రాలను ధరించడం మంచిది కాదు.

◆ కాటన్ దుస్తులు చెమటను తగ్గించి వంటికి చల్లదనాన్ని అందిస్తాయి.

◆ శరీరానికి తగినంత గాలి అందించే కాటన్ దుస్తులు వాడటం వల్ల చర్మ వ్యాధులు, దురదల నుండి శరీరాన్ని కాపాడుకోవచ్చు.

◆ ముదురు రంగులు, మందపాటి వస్త్రాలకు వీలైనంత దూరంగా ఉండాలి.

◆ లేత రంగులు వేడిమిని ఎక్కువగా గ్రహించక శరీరానికి హాయినందిస్తాయి.

◆ తెలుపు రంగు దుస్తులైతే మరీ మంచిది. అన్ని రంగుల కంటే తెలుపు రంగు వేడిమిని అతి తక్కువగా గ్రహిస్తుంది.

◆ నలుపు, ఆకుపచ్చ రంగు వస్త్రాలను ధరించకపోవడమే మేలు.

◆ వాటి నివాసాలను మరీ చీకటి ప్రదేశాలలో కాకుండా గాలి వెలుతురు ఎక్కువగా అందే ప్రదేశాలలోనే ఏర్పాటు చేయాలి.

◆ తగినన్ని నీరు, ఆహారం అందిస్తూ సాయంత్రం చల్లని గాలిలో తిప్పాలి.

◆ పెంపుడు జంతువులపై శ్రద్ధ పెట్టకపోతే ఇవి కూడా త్వరగా అనారోగ్యానికి గురవుతాయి.

టూర్ కో ప్లాన్

వేసవిలో పిల్లలకు బోలెడు సెలవులొచ్చినా వాళ్లను విహార యాత్రలకు తిప్పేందుకు పెద్దలు ఎండ వల్ల జంకుతారు. ఇంట్లోనే ఎన్ని రోజులుంటారు.. బోర్ కొట్టేస్తుంది. అమ్మమ్మ, నాన్నమ్మల దగ్గర కావాల్సినన్ని కథలు చెప్పించుకోడానికి ఊరు ప్రయాణం కట్టాలని వాళ్ల మనసు ఉవ్విళ్లూరుతూ ఉంటుంది. ఎక్కడకెళ్లేది? ఎండలు మండిపోతున్నాయి? ఇంట్లో ఉండే మీకేం తెలుస్తుంది.. బయటకు నాలుగడుగులేయండని..

ఊరు మాటెత్తినప్పుడల్లా పెద్దోళ్లు కసురుకుంటారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే విహార యాత్రలకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన పనిలేదు. యాత్రలు పిల్లల

మనో వికాసాన్ని పెంచుతాయి. పిల్లల రిలాక్షేషన్ కోసం వారిని వేసవి సెలవుల్లో టూర్లకి తీసుకెళ్లాలి. వాటర్ పార్క్, స్నో వరల్డ్‌లే చూపించాలని లేదు. పచ్చదనంతో కళకళలాడే ప్రకృతి సీమలకు ప్రయాణం కట్టొచ్చు.

◆ వేసవిలో టూర్‌కి కొంచెం ముందుగా ప్లాన్ చేసుకోవాలి.

◆ మనం వెళ్లే ప్రదేశం అక్కడి వాతావరణ పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు ఎలా వెళ్లాలి, ఏఏ ప్రదేశాలను చూడాలి, ఎక్కడ వుండాలి అనే వాటిని ముందే ప్లాన్ చేసుకోవాలి.

◆ మనతో పాటు తప్పని సరిగా అవసరమైన మందులు, చలువ పానీయాలు తీసుకెళ్లాలి.

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా ఈ వేసవిని కూల్‌గా ఎంజాయ్ చేయగలుగుతాం!

వ్యాయామం తప్పనిసరి

వేసవి రాగానే వేడి భరించలేమంటూ చాలా మంది మార్నింగ్, ఈవినింగ్ వాక్‌లను కూడా మానేసి ఇంట్లో వుండిపోతుంటారు. అలా చేయడం వల్ల శారీరక శ్రమ తగ్గి ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతాయి. ప్రకృతిలో సంభవిస్తున్న మార్పుల కారణంగా చలికాలం, వానాకాలంలో వచ్చే శ్వాసకోశ వ్యాధులు, వైరస్, ఫ్లూ ఇప్పుడు వేసవిలో కూడా వస్తున్నాయి. వీటి బారిన పడకుండా వుండాలంటే వ్యాయామం తప్పనిసరి. ఎండను తట్టుకోలేని వారు కనీసం ఇంట్లోనైనా శరీర వేడిని తగ్గించే ప్రాణాయామం, వ్యాయామం చేయడం మంచిది. వేసవిలో ప్రాణాయామం ఎక్కువగా చేయడం వల్ల శరీరానికి తగినంత ఆక్సిజన్ అంది శ్వాస సంబంధిత వ్యాధుల నుండి బయటపడొచ్చు.

వాడిపోయిన పూలే పెట్టుబడి

యువ

HELP US GREEN®
POWERED BY NATURE

గంగా నదిలో పూల వ్యర్థాలను తొలగిస్తారు. తొలగించిన వాటిని దేనికైనా ఉపయోగిస్తే అనే ఆలోచన వచ్చింది.. ఓ ఇద్దరు మిత్రులు అంకిత్, కరణ్‌లకు ఇంట్లో చెబితే ఒప్పుకోలేదు. ఉద్యోగాన్ని వదిలేసి పువ్వులు ఏరుకుంటూ కూర్చుంటారా.. అంటూ తల్లిదండ్రులు వద్దంటే వద్దన్నారు. కానీ ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగులేసి లాభాల బాటలో నడుస్తున్న ఓ సంస్థకు ప్రాణం పోశారు ఆ ఇద్దరు మిత్రులు. వారికే కాక ఎంతో మందికి ఉపాధి చూపిస్తోంది వారి ఆలోచన.

కాన్పూర్‌కి చెందిన ఈ ఇద్దరు మిత్రులు... ఓ రోజు గంగానది వద్ద వ్యాహ్యాళికి వెళితే అక్కడ కొందరు క్వింటాళ్ల కొద్దీ పువ్వులని గంగా నదిలో పడేయటం చూశారు. ప్రతీ సంవత్సరం ఎనిమిది లక్షల టన్నుల పువ్వులను భారతీయ నదుల్లో వేస్తారని అంచనా. గంగా నదిలో కాలుష్యానికి ప్రధాన కారణాల్లో ఇదీ ఒకటి. ఆ పువ్వులతో పనికొచ్చే పనిచేయలేమా అన్న ఆలోచన వారికి లాభాల పంట పండించింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన అంకిత్ అగర్వాల్, కరణ్ రస్తోగీ "హెల్ప్ అజ్ గ్రీన్" అనే సంస్థకు రూపకల్పన చేశారు. గంగానదిలో పడేసే పూలనే కాక గుళ్ళలో, మసీదుల్లో, పెళ్ళిళ్లల్లో వాడిన పూలను కూడా సేకరించి వాటితో అగర్‌బత్తీల తయారీ చేస్తున్నారు. ఓ వైపు వ్యర్థాల వల్ల ఉత్పన్నమయ్యే కాలుష్యమూ తగ్గింది. మరో వైపు వంద మందికి ఉపాధి దక్కింది. కాన్పూర్‌లోని 85 నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలకు జీవనోపాధి కల్పిస్తోంది.

సంప్రదాయ పద్ధతిలో తయారు చేసే అగరుబత్తీల్లో వాడే బొగ్గు క్యాన్సర్‌కు కారణమవుతుందని తెలుసుకున్నారు. అందుకు భిన్నంగా వాడిన పువ్వులను ఉపయోగించి అగరుబత్తీలు తయారు చేసే పద్ధతిని కనిపెట్టారు. స్టిక్స్ అండ్ స్టోన్స్' పేరుతో చేతితో సహజసిద్ధమైన అగరుబత్తులను తయారు చేస్తున్నారు. ఎక్కడా పర్యావరణానికి హని కలగకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్తపడుతున్నారు. ప్యాకెజింగ్‌లో ఓ కొత్త ఒరవడి తీసుకొచ్చారు. డస్ట్‌బిన్‌లో పడేసే బదులు దాంతో ఏదైనా పర్యావరణానికి మేలు కలిగే ప్రయత్నం చేద్దామని ఆలోచించారు. సీడ్ పేపర్ (మొక్కల విత్తులుండే కాగితం)తో ప్యాకేజింగ్ మెటీరియల్ రూపొందించారు. ఖాళీ అయిన రేఫర్‌ను ఓ తొట్టెలో ఉంచి రోజూ నీళ్లు పడితే కొద్దిరోజుల్లో మొలకెత్తుతుంది. అద్భుతమైన ఐడియా కదా.

ప్రస్తుతం వీళ్లు 13 ఆలయాలు, 3 మసీదుల నుంచి పువ్వుల్ని సేకరిస్తున్నారు. ప్రతి రోజు ప్రార్థనా మందిరాలకు వెళ్లి వ్యర్థాలను సేకరించి అందులోంచి పాల ప్యాకెట్లు, పువ్వుల దారాలు, పేపర్లు, ప్లాస్టిక్‌లను వేరు చేస్తారు. ప్రతి రోజూ ఐదు వందల కిలోల పువ్వులను తిరిగి ఉపయోగిస్తున్నారు. ఇప్పటి వరకు ఇలా లక్షన్నర కిలోల పువ్వులను సేకరించారు. వీరి ఉత్పత్తులు స్విట్జర్లాండ్, జర్మనీలకు ఎగుమతి అవుతున్నాయి. వీళ్లు చేసే ఉత్పత్తి తక్కువ. ఎగుమతి రంగంలో లాభాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్లే ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. యజ్ఞ పేరుతో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, స్నాప్ డీల్ లాంటి ప్రముఖ ఇ-కామర్స్ పోర్టల్స్‌లో అమ్ముతున్నారు.

ఇవెస్సీ ఐడియా ఛాలెంజ్ 2015, ఐఐఎం ఇండోర్ కల్పవృక్ష ఛాలెంజ్ 2015, ఐఐటీ కాన్పూర్ సోషల్ ఛాలెంజ్ 2015 అవార్డులు గెలుచుకున్నారు. టాటా సోషల్ ఎంటర్‌ప్రైజ్ ఛాలెంజ్ 2016లో ఫైనలిస్టులు వీళ్లు. ఈ స్థాయిలో వస్తున్న గుర్తింపు వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల అభిప్రాయాల్ని మార్చేశాయి.

26 ఏళ్ల కరణ్ వార్విక్ బిజినెస్ స్కూల్ నుంచి బిజినెస్ అనలిటిక్స్ అండ్ కన్సల్టింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశాడు. అప్పట్లో క్లైమేట్ ఛేంజ్, కార్బన్ క్రెడిట్స్‌పై థీసిస్ చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. 26 ఏళ్ల అంకిత్.. ఇంజనీరింగ్ చేసిన తర్వాత పుణెలోని సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ నుంచి ఇన్నొవేషన్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ పూర్తి చేశాడు. సిమాంటిక్ కార్పొరేషన్‌లో మూడేళ్లు పనిచేశాడు. పాడైపోయిన టైర్ల వల్ల పర్యావరణానికి హానీ ఎక్కువని పరిశోధనలో తేల్చాడు. పలు అంతర్జాతీయ పత్రికల్లో 13 పరిశోధనా పత్రాలు పబ్లిష్ అయ్యాయి. తన పరిశోధనలపై పలు పేటెంట్ ఆఫీసుల్లో సమీక్ష జరుగుతోంది.

మిట్టీతో..

చిన్నప్పుడు చదువుకున్న కంపోస్ట్ ఎరువు పాఠం గుర్తుకు వచ్చింది. అనేక మంది బోటని ప్రొఫెసర్లను, రైతులను వాళ్ళు కలిశారు. ఆసక్తి గల వారితో సేంద్రీయ ఎరువులు తయారు చేసేవాళ్లతో, పువ్వుల వ్యాపారులతో, ఆలయ కమిటీలతోనూ మాట్లాడారు. కోళ్ల పరిశ్రమల నుంచి వచ్చే జీవ వ్యర్థాలతో ఎరువులు ఎలా తయారు చేస్తున్నారనే దానిపై అధ్యయనం చేశారు. వారి ప్రయత్నం ఆరు నెలల తర్వాత ఫలించింది. 17 సహజ పదార్థాలతో తయారు చేసిన ఎరువును వారు కనుగొన్నారు. వర్మీ కంపోస్ట్‌లో నైట్రోజన్ లెవల్‌ను పెంచేందుకు కాఫీ, టీ వ్యర్థాలను వాడారు. కాన్పూర్‌లోని కాఫీ, టీ హోటళ్లలో 'మిట్టీ'ని సేకరిస్తారు.

- అనంతోజు మోహన్ కృష్ణ
8897765417

తెలుసా

ఇవీ పలకరింపులే

ఉత్తర నైజీరియన్లు కుడిచేయి పైకెత్తి పిడికిలి బిగిస్తారు.

గ్రీస్‌వారు తమ మిత్రుల వెన్ను భాగాన్ని తట్టి తమ శుభాకాంక్షలు తెలుపుతారు.

ఫ్రాన్స్ పాలినేషియన్ దీవుల్లోని తువాలు వాసులు పరిచయస్తులు ఎదురైనపుడు తమ ముఖాన్ని ఎదుటివారి చెంపకు గట్టిగా తాకించి ముక్కుతో గాలి పీలుస్తారు.

ఒమన్ పురుషులు కరచాలనం అనంతరం తమ మిత్రుల ముక్కును ముద్దాడతారు.

రొమేనియా వాసులు తమ కంటే వయసులో చిన్నవారైన యువతులను కలిసినపుడు కరచాలనానికి బదులుగా వారి చేతిని ముద్దాడతారు.

అమెరికాలోని రెడ్ ఇండియన్స్ పరస్పరం సిగరెట్స్ ఇచ్చి పుచ్చుకుని గ్రీట్ చేసుకుంటారు.

ఫ్రాన్స్, బెల్జియం దేశాల్లో టోపీలు తీసి ఆలింగనం చేసుకుంటారు.

న్యూజిల్యాండ్‌లోని మావోరీస్ ఆదిమ తెగ వారు తమ సంతోషాన్ని తెలుపుతున్నట్లు పరస్పరం ముక్కు రాసుకుంటారు.

చైనా వారు చేతులు జోడించి తలలు వంచుతారు.

దక్షిణాఫ్రికాలోని 12 జాతుల ఆదివాసులు లయబద్ధమైన చప్పట్లను కొడుతూ పలకరిస్తారు.

అర్జెంటీనా వారు మిత్రులని కలసినప్పుడు ఇరువురూ ఆలింగనం చేసుకుని ముద్దాడే వరకూ ఒకరి చేయిని మరొకరు పట్టుకునే ఉంటారు.

టిబెటియన్లు పలకరింపునకు చిహ్నంగా తమ నాలుకను బైటికి చాపుతారు.

కెన్యా దేశీయులు కొత్తవారితో స్నేహం ఏర్పడి, ఇరువురూ విడిపోయే ముందు తమ స్నేహానికి గుర్తుగా వారి తలపై ఉమ్మి వేస్తారు.

న్యూజిల్యాండ్ వాసులు పరిచయస్తులను కలసినపుడు ఇరువురూ ముక్కు రాసుకుంటారు.

-హైమా శ్రీనివాస్

బైక్‌పై దూసుకుపోతూ లా..ంగ్ రైడ్ చేయొచ్చు. టాప్‌లెస్ కారుపై సముద్ర తీరాల వెంట జోరుగా సాగిపోవచ్చు. కానీ ఓ వీల్ చైర్లో ఊరు దాటగలరా? సాహస యాత్ర మాటెత్తగలరా? కానీ ఓ కుర్రాడు రెండేళ్లుగా వీల్ చెయిర్‌పై చైనా చుడుతున్నాడు. సుమారు 6 వేల కి.మీ.ల ప్రయాణం చేశాక మరో 2 వేల కి.మీ.లకు చక్రాలను మారుస్తున్నాడు. మిత్రుల్లా దేశం చుట్టి రావాలని ఎప్పటి నుంచో తీరని కల ఉండేది. కాళ్లు చచ్చుబడిన నీది ఉత్త కలే అవుతుందని కొందరన్నా చక్రాలను గిర్రున తిప్పి ఆ మాటల్ని తొక్కేశాడు. ఇప్పుడు తన మిత్రులెవరూ వెళ్లనంత దూరాల్ని, తిరగనంత ప్రాంతాల్ని, కలగననంత అద్భుతాల్ని చవి చూస్తున్నాడు.

చైనాలో 'చక్రం' తిప్పి...

ఆ సాహసి పేరే కువాన్ పెంగ్. 2014 ఆగస్ట్ 31న బీజింగ్ నుంచి యాత్ర మొదలెట్టిన ఈ 29 ఏళ్ల యువకుడు కొన్ని రోజుల క్రితమే పుజౌ నగరానికి చేరుకుని ఓ అంకాన్ని పూర్తి చేశాడు. ఇప్పుడు చైనా దక్షిణ కొసలో ఉండే హైనాన్ ప్రావిన్స్‌లోని సాన్యా పట్టణం దిశగా సాగిపోతున్నాడు. ఇది 2500 కి.మీ.ల ప్రయాణం. మరో ఆరు నెలల్లో దీన్ని పూర్తి చేయాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు దారిన మొత్తం 5 ప్రావిన్స్‌లన్నింటినీ తిరిగేశాడు. 22 నగరాలను జల్లెడ పట్టాడు. తన వైకల్యం తనని బంధీ చేయలేదని, స్వేచ్ఛ కోసం ఎంత దూరమన్నా సాగిపోతానని కువాన్ అంటున్నాడు. కేవలం తన స్వేచ్ఛ కోసమే కాక తన ప్రయత్నాన్ని చూసి మరికొందరు అంగ వైకల్యాన్ని జయించి ముందుకు సాగాలని తమ గమ్యాలను చేరాలనే తపన కలిగించాలని ఈ యాత్ర ప్రారంభించానని కువాన్ చెబుతున్నాడు. దారిన అతణ్ని కలిసిన చాలా మంది యాత్ర వివరాలు తెలుసుకుని ఆశ్చర్యపోతున్నారు. అంతా బాగున్నా కూడా లక్ష్యం వైపు గమ్యం వైపు ఓ అడుగు ముందుకు వేసేందుకు జంకేవారికి ఎక్కడలేనంత ఉత్తేజాన్ని కలిగించాడు తన వీల్ చైర్ సాక్షిగా కువాన్. మరో ముఖ్యమైన అంశాన్ని కూడా డాక్యుమెంట్ చేశాడు. తనలాంటి వారికి ఏయే ప్రాంతాల్లో ఎలాంటి సదుపాయాలు కల్పించింది వాటిలో మంచి చెడుల నిగ్గుదీస్తూ.. వివరాలు అధికారులకు అందిస్తూ కదిలిపోతున్నాడు. చైనాలో సుమారు 8.5 కోట్ల మంది అంగవైకల్యమున్న వారున్నారు. బీజింగ్ లాంటి నగరాల్లో వీల్‌చెయిర్‌లో రోడ్డున వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలు, ర్యాంపులు ఏర్పాటు చేశారు. రెస్ట్ రూమ్‌ల్లోను ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. కానీ మిగతా చాలా చోట్ల సదుపాయాల జాడే లేదని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కు తగ్గకుండా సాగిపోదామని నిశ్చయించుకున్నానని కువాంగ్ వివరించాడు. గాన్సు ప్రావిన్స్‌కు చెందిన కువాన్‌కు చిన్న వయసులోనే వెన్నులో ఓ గడ్డ పెరిగింది.

తనకు 17 ఏళ్ల వయసులో శస్త్ర చికిత్స చేస్తే కాళ్లు చచ్చుబడిపోయాయి. అప్పుడే యవ్వనంలోని అతిశయాలకు చేరువైన కువాన్‌కు ఇక జీవితమంతా వీల్ చెయిరే అయ్యింది. అలా కొన్ని రోజులు తన ఊరిలోనే నిస్తేజంగా తిరిగిన కువాన్‌కు తనపై విసుగొచ్చింది. ఎంత సేపు అది చేయలేను ఇది చేయలేనని తన మనసులో తానే సంకెళ్లు వేసుకుని ఎటూ కదలకుండా ఇక్కడే ఉండిపోతే ఎలా అని ప్రశ్నించుకున్నాడు. పనిని వెతుక్కుంటూ 2013లో బీజింగ్‌కు చేరాడు. కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తూనే మిగతా సమయంలో టావోబావో అనే ఆన్‌లైన్ స్టోర్‌ను నడిపేవాడు. ఓ చాలెంజ్ పూర్తయ్యింది. కానీ కొన్నేళ్లుగా తనకు అందనన్నట్టు సాహస యాత్ర కలపై దిగులు పెరిగింది. ఆ సవాల్‌ను తీసుకున్నాడు కువాన్.

సాధ్యమేనా?

తొలుత వీల్ చెయిర్‌లో దేశాటన సాధ్యమా అని తనకే సందేహం కలిగింది. ప్రయత్నించి చూద్దామని నచ్చజెప్పుకుంటూ వీల్ చెయిర్‌ను ముద్దాడాడు. వీల్ చెయిర్‌లోనే బ్యాగేజీ, టెంట్ సామాను అంతా సర్దుకుని, వర్షం, ఎండల నుంచి రక్షణగా ఓ గొడుగు కట్టుకుని వీల్ చెయిర్‌పై రయ్యున దూసుకుపోతున్నాడు. తొలి రోజు ప్రయాణం సాఫీగా సాగిపోయింది. ఆ ఒక్క రోజే 60 కి.మీ. దూరం వీల్ చెయిర్‌ను కదిలించగలిగాడు. కానీ చేతుల్తో అదే పనిగా చక్రాలను తిప్పడం వల్ల భరించలేనంత భుజాల నొప్పులు తర్వాతి రోజు సలిపేశాయి. అది మరింత కసిని రేపి తర్వాతి రోజు ప్రయాణాన్ని మరింత బలంగా ముందుకు నెట్టింది.

కువాన్ ప్రయాణంలో 6 సార్లు వీల్ చెయిర్ నుంచి కింద పడిపోయాడు. ఓ సందర్భంలో కొండ వాలుపైకి చేరుకునే సమయంలో ఒక్కసారిగా వీల్ చెయిర్ వెనక్కు జారి తలకిందులై ప్రాణం తీసేంత ప్రమాదం జరిగింది. ఈ అనుభవాలతో వీల్ చెయిర్‌ను తిప్పడంలో మెళకువలు పట్టి మరో మైలు ముందున్న పర్వత సానువుల్ని చూస్తూ... గంభీరంగా చేతుల్ని మరింత బలంగా బిగించాడు. హువాంగ్‌పూ నదీ తీరాన సేద తీరాడు. షాంఘై నగర కాంతుల్ని లెక్కేట్టాడు. చారిత్రక పుజౌను తట్టి చూశాడు. తూర్పు చైనా వూజెన్ కెనాల్ పట్టణ తీరుకు మురిసిపోయాడు. తైషాన్ పర్వత సానువులు కూడా కువాన్ సంకల్పానికి సలామ్ చేశాయి. ఎవరి సాయం లేకుండా ఒక్కడే వీల్‌చెయిర్‌ను తిప్పుతూ శిఖర దర్శనం చేసొచ్చాడు. ఆ తర్వాత తాను సాధించలేని ప్రాంతం, పర్వతం అంటూ చైనాలో లేదని గుండెల నిండా ఊపిరి తీసుకుని మెల్లిగా నిశ్వాసించాడు. తనదో యుద్ధమంటాడు అది తన వైకల్యంతో, మానసిక అడ్డంకులతో కాదని.. సాటి వారిలో వికలాంగుల పట్ల చిన్నచూపుపైనేనని.. తన యాత్ర ద్వారా గౌరవాన్ని తన లాంటి వారికి మోసుకుపోతున్నానని కువాన్ ఉద్వేగంతో చెబుతాడు.

- అనన్య ప్రసిద్ధ్

ప్రేయసి కోసం..

చైనాలోని గువాంక్షి జువాంగ్‌లోని లిజౌకు చెందిన ఓ ప్రియుడు తన ప్రేయసిని తీసుకుని ఓ ప్రేమ యాత్ర పూర్తి చేశాడు. వీల్ చెయిర్‌కే పరిమితమైన ప్రియురాలికి ప్రపంచాన్ని చూపించాడు డింగ్ యుజౌ. వారికి తోడుగా పెంపుడు కుక్కను వెంట తీసుకెళ్లారు. ఓ మౌంటైన్ బైక్‌కు వీల్ చెయిర్‌ను కట్టి డింగ్ ప్రయాణాన్ని కట్టాడు. సెరెబ్రెల్ అటాక్సియా వ్యాధి బారిన పడిన ప్రేయసి నడవడం కాదు... కనీసం ఆహారాన్ని కూడా నమలలేకపోయేది. ఆమె పరిస్థితికి తల్లడిల్లిపోయిన డింగ్ ఆమె పెదాలపై మళ్లీ నవ్వు చూడాలని ఈ సాహస యాత్రకు సిద్ధమయ్యాడు. లిజౌలో రెండు రోజులపాటు హైకింగ్, క్యాంపింగ్‌పై ట్రయల్స్ వేసి పూర్తి యాత్రకు సంసిద్ధులయ్యారు. యాత్ర రూట్ మ్యాప్ కూడా ఒకరిపై ఒకరంటే ఎంత ప్రేముందో, వారిది ఎంత ప్రాణ బంధమో చెబుతున్నట్టుగా ప్రేమ గుర్తు హృదయాకారంలో వేసుకున్నారు. ఇలా చైనాను చుట్టొచ్చారు.

అమ్మకు ప్రేమతో..

చైనాలోని యాన్ రాంగ్ అనే మరో మహిళ జబ్బుపడి వీల్ చెయిర్‌లో కుదేలైన తన తల్లికి 14 దేశాలు చూపించింది. 2006లో హైనాన్‌కు మొదటి ట్రిప్ వేసిన ఆమె తన అక్కచెల్లెళ్లను కూడా తీసుకుని ప్రపంచ యాత్ర చేసింది. అమ్మను విమానం తొలిసారి ఎక్కించిన సందర్భంలో యాన్ భావోద్వేగానికి లోనై కంట నీరు ఒలికింది. థాయ్‌ల్యాండ్, జపాన్, కొరియా, మాల్దీవులతో పాటు మరో పది పాశ్చాత్య దేశాలను సందర్శించారు ఆ నలుగురు. అమెరికాలోని గ్రాండ్ కేన్యాన్ మీదుగా ఓ హెలికాప్టర్ రైడ్ చేయించింది తల్లితో. తొమ్మిదేళ్ల ప్రయాణాల్లో ఇప్పటి వరకు 5 వీల్ చెయిర్‌లు మార్చాల్సి వచ్చింది. ఎంతో ప్రయాసలతో కూడిన ఈ యాత్రలో చివరకు యాన్‌కు ఓ గొప్ప బహుమతి లభించింది. తన తల్లి ఆరోగ్యం చాలా మెరుగైంది.

మరో గ్రహవాసికి పిరమిడ్..!



మెక్సికో ఆజ్‌టెక్ పిరమిడ్‌కు నకలును ఓ మెక్సికో రైతు కట్టేశాడు. 22 అడుగులు ఎత్తున్న ఆ పిరమిడ్‌ను ఎందుకు కట్టావంటే? ఏలియన్ల ఆర్డరదని మతిపోయే సమాధానం చెబుతున్నాడు.. కర్షకుడు రేమండో కరోనా. మెక్సికో-యూఎస్ సరిహద్దుకు 74 కి.మీ. దూరంలో ఉండే ఎడారి ప్రాంతంలో ఈ పిరమిడ్‌ను సొంతగా కట్టేశాడు. ఓ గ్రహాంతర వాసి 33 ఏళ్ల క్రితం ఈ పిరమిడ్‌ను కట్టమన్నాడట. అతడు ఓరియన్ నక్షత్ర మండలంలోని నెఫిలిన్ అనే గ్రహం నుంచి వచ్చాడని, పేరేమో హెరులాయక అని చెప్పాడని, ఆ గ్రహం భూమి కంటే 20 రెట్లు పెద్దగా ఉంటుందని తడబడకుండా వివరాలు చెప్పేస్తున్నాడు.. రేమండో. తన భార్య కొన్ని రోజుల్లో బిడ్డకు జన్మనివ్వబోతుండగా ఆ వ్యక్తి తనింటికి వచ్చాడని, అతని కోసం ఆ పిరమిడ్‌ను కట్టమన్నాడని అంటున్నాడు. నీకేమైనా మతి తప్పిందా అని ఎవరన్నా అంటే "ఆ.. ఆ.. అది కూడా చెప్పాడు ఆ గ్రహాంతరవాసి. నేను పిరమిడ్ కథ చెబితే అందరూ నన్ను పిచ్చోళ్లంటారని హెచ్చరించాడు. మనం భూమిని పాడు చేసేస్తున్నాం. అందుకే వాళ్లు అప్పుడప్పుడూ వచ్చి గమనించి వెళుతున్నారని ఆ మరో గ్రహం మనిషి అన్నాడు. అయినా నా మాట మీద నమ్మకం లేకపోతే... పొలం దున్నుకునే వాడికి ఆజ్‌టెక్ పిరమిడ్‌ను అచ్చుగుద్దినట్టు దించేసే గణితం, నిర్మాణ శాస్త్రం ఎలా అంతుబట్టింద"ని ఎదురు ప్రశ్నిస్తున్నాడు.

పిల్లితో మాటా మంతీ

మనకు ప్రాంతానికో మాండలికం ఉన్నట్టు.. పిల్లులకు కూడా మీయావ్ యాస వేర్వేరుగా ఉంటుందా? ఆ విషయాన్నే తేల్చేందుకు స్వీడన్‌కు చెందిన కొందరు శాస్త్రవేత్తలు పరిశోధన చేస్తున్నారు. మరో ఆసక్తికర విషయమేమంటే పిల్లుల అరుపులపై అక్కడి ప్రాంత మనుషులు లేదా పెంచుకునేవారి మాట తీరు ప్రభావం చూపుతుందో లేదోనని లుండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు గమనిస్తున్నారు. భాషా శబ్ద నిపుణురాలైన సుసాన్ స్కోట్జ్ ఈ 'మియావ్‌సిక్' బృందానికి నేతృత్వం వహిస్తున్నారు. ఐదేళ్ల పాటు పిల్లుల పిలుపుల్లోని తీవ్రత హెచ్చు తగ్గుల్ని లెక్కించి, ఫొనెటిక్స్‌ను ఆధారం చేసుకుని విషయం రాబడతారట. వివిధ పరిస్థితుల్లో వేర్వేరు ప్రాంతాల్లోని 30-50 పిల్లుల అరుపుల్ని రికార్డ్ చేసి అధ్యయనం చేస్తారు. ప్రత్యేకమైన పరికరాల్ని రూపొందించుకున్నారు. పిల్లుల్ని పదివేల ఏళ్ల క్రితం నుంచి పెంపుడు జంతువుల్లా మనిషి మచ్చిక చేసుకున్నాడు. అంత పాత స్నేహం కాబట్టి ఇద్దరి మధ్యా మాటా మంతీ చక్కగా ఉంటోంది.

'పచ్చ'టి ఇల్లు

వింత లోకం

నెదర్లాండ్స్‌లోని రోటర్‌డ్యామ్‌కు చెందిన వృక్ష కళాకారిణి హెల్లీ స్కోల్టెన్ తన కుటుంబంతో కలసి ఓ పర్యావరణ హిత గ్రీన్‌హౌజ్‌లో జీవిస్తోంది. కేవలం మొక్కల్ని మాత్రమే పెంచే గ్రీన్‌హౌజ్‌లో ఇంటి సామాను సర్దేసిన ఆ కుటుంబంలో హెల్లీ ఇద్దరు టీనేజీ పిల్లలు, భర్తతో పాటు ఓ కుక్కపిల్ల కూడా మెంబర్లు. ఇంటి రూఫ్‌టాప్‌పై కూరగాయల్ని కూడా పెంచేస్తున్నారు. రోటర్‌డ్యామ్ విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు విద్యార్థులు ఎకో ఫ్రెండ్లీ ఇళ్ల ప్రాజెక్ట్ చేపడతున్నారని తెలిసి వారిని కలసి ఇలా ఆ మోడల్ ఇంట్లో తిష్ట వేశారు. మూడు బెడ్రూమ్‌లుండే ఆ ఇంట చక్కటి వెలుతురు పడేలా అద్దాలతో పైకప్పు బిగించారు. తాజాగానే కాకుండా ఎండల్లో చల్లగా, చలి కాలంలో వెచ్చగా గాలి తగిలేలా ఓ పైపును నేలకు 3 అడుగుల కింద ఏర్పాటు చేసి దాని నుంచి ఇంటిలోకి గాలి వచ్చేలా చేశారు విద్యార్థులు. ఉష్ణాన్ని పట్టి ఉంచేలా లోపలి గోడల్ని లోమ్ స్టక్కోతో కోటింగ్ వేశారు. ఆ ఇంట్లో తాత్కాలికంగానే ఉంటోన్న హెల్లీ కుటుంబానికి అది తెగ నచ్చేసి స్వీడన్‌లోని తమ మరో ఇంటికి గ్రీన్‌హౌజ్ ఏర్పాట్లు చేశారు.



పచ్చగా బిడ్డలు..

షాంఘైకి చెందిన యీ జైఫెంగ్‌కు ప్రకృతి రుణం రోజురోజుకి పెరిగిపోతోంది. ఎడారి మింగుతోన్న ఉత్తర చైనాలోని ఇన్నర్ మంగోలియాలో ఆమె లక్షలాది మొక్కలు నాటి పచ్చదనానికి చికిత్స చేస్తోంది. పన్నెండేళ్లుగా ఇలా చెట్లను పెంచుతున్న యీ దంపతుల సంకల్పం వెనుక వారి బిడ్డ యాంగ్ కల ఉంది. పర్యావరణ ప్రేమికుడు అయిన యాంగ్ రుజే 2000లో జపాన్‌లో ఓ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. కొడుకు మరణంతో కుప్పకూలిన ఆ కుటుంబంలో మళ్లీ జీవం చివుర్లు వేసింది యాంగ్ ఆశయాలతో. పచ్చని ప్రకృతికి అంకితమవుతానని పదే పదే చెప్పిన కొడుకు మాటల్ని గుర్తు తెచ్చుకుని ఆ పచ్చదనంలో కొడుకును చూసుకోవాలని ఇలా యీ దంపతులు చెట్లను పెంచుతున్నారు. యాంగ్ ఇన్సూరెన్స్ సొమ్ము సుమారు కోటిన్నర రూపాయలతో 2003లో గ్రీన్ లైఫ్ అనే ట్రస్ట్ మొదలెట్టి యీ కొన్నేళ్లలోనే ఎడారి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసింది. యీ దంపతుల్లానే బిడ్డల్ని పోగొట్టుకున్న కన్నవాళ్లు కూడా చాలామంది ముందుకొచ్చి తమ బిడ్డల్ని మొక్కల్లో చూసుకుని ప్రాణం పెట్టి పెంచుతున్నారు.



చారిత్రకావసరం "చార్వాక దర్శనం"

"ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు దాచేస్తే దాగని సత్యం" అని శ్రీశ్రీ అన్నట్టు, ఇప్పుడొక చారిత్రక సందర్భం ముందుకు వచ్చింది. ఈ చారిత్రక సందర్భంలో "చార్వాక దర్శనం" మరోసారి ముందుకు తేవాల్సిన అవసరం వచ్చింది. ఆ అవసరాన్ని డాక్టర్ కత్తి పద్మారావుగారు తీర్చారు.

రెండురెళ్లు నాలుగన్నందుకు హిందుత్వ గూండాలు గండ్రాళ్లు విసిరే రోజుల్లో బతుకుతున్నాం మనం. మూఢనమ్మకాలు వద్దన్నందుకు "డా.ధబోల్కర్", దారి దోపిడీ వద్దన్నందుకు "పన్సారే", బసవడిదే కన్నడ తత్వం అన్నందుకు "కల్బుర్గి"లను సంఘపరివార్ శక్తులు హత్య చేసిన కాలం ఇది. 'ఉరి'లో మానవత్వం లేదన్నందుకు 'రోహిత్ వేముల'ను హరించివేశాయి శక్తులు. పాకిస్తాన్ గురించి ప్రస్తావించినందుకు దేశంలో అత్యున్నత విశ్వవిద్యాలయం సైతం దేశ ద్రోహులుగా ముద్ర వేయబడ్డ ముదనష్టపు రోజుల్లో మనమున్నాం. మేము చెప్పిందే వేదం, మేము చేసిందే వాదం, మేము తినే తిండే అందరూ తినాలనే మూర్ఖపు శక్తులతో మనం వాదించాల్సిన రోజులివి. అందుకు అనేక ఆయుధాలు మనకు కావాలి. ఇదుగో పదునైన ఆయుధాన్ని కత్తి మన ముందుంచుతున్నారు. ఆ ఆయుధం పేరు భారతీయ భౌతికవాదం "చార్వాక దర్శనం".

అదొక నిప్పు రవ్వ. ఒక్కోసారి నివురుగప్పి మరోసారి జాజ్వలమై వెలుగుతూ భారతీయ మూలవాసుల గొంతై వినిపిస్తూ ఉంటుంది చార్వాకం. "నిప్పు మానవజీవితాన్ని ఒక భౌతికశక్తిగా ప్రభావితం చేసింది. భారతదేశంలో చార్వాకులు నిప్పుకి "భౌతిక శాస్త్రతత్వాన్ని " రూపొందించారు." అటువంటి నిప్పురవ్వను ఆయుధంగా మలచి నాలుగోసారి ప్రజలకందిస్తున్నారు డా.కత్తి పద్మారావు.

భారతీయ తాత్విక మూలాలు భౌతికవాదంలో ఉన్నాయి. లోకాయతుల, చార్వాకుల, సాంఖ్యుల ప్రతిపాదనలు దేశంలోని ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. వర్ణవ్యవస్థను, కులవ్యవస్థను కాపాడుకొని దోపిడీని కొనసాగించుకోవటం కోసం అగ్రవర్ణాలు సాగించిన దుర్మార్గాలను ఎదుర్కొని ప్రజలను చైతన్యం చేశారు. చార్వాకులు. మనిషి పుట్టుక, చావుల గురించి సరైన ఆలోచనలను వారు ప్రచారం చేశారు. ఇతరదేశాల తత్వశాస్త్రాల కంటే "ఆత్మ" గురించి భారతీయ తాత్వికులలో జరిగిన చర్చ చాలా ఎక్కువ. "మృత్యువు తరువాత ఇంకేమీ లేదనే విషయాన్ని చార్వాకులు మూడువేల ఏళ్ల క్రితమే చెప్పారు." "సుఖదు:ఖాల సమ్మేళనమే జీవితం", "స్వర్గ నరకాలు కల్పితం", కొద్దిమంది జీవనోపాధి కోసం ఇటువంటివి సృష్టించబడ్డాయని వారు స్పష్టంచేశారు. భూమి, నీరు, గాలి, అగ్ని, ఈ నాలుగుతో ప్రపంచం సృష్టించటం జరుగుతుందని చార్వాకులు ఆనాడే ప్రచారం చేయడం అసాధారణ విషయం. ఏ విషయం పైనైనా ప్రత్యక్ష ప్రమాణం ఆధారంగానే నిర్ధారణకు రావాలని వారు ప్రతిపాదించారంటే వారి భౌతిక వాద దృష్టి మనకవగతమవుతుంది.

దళిత తత్వ శాస్త్రం-
భారతీయ భౌతిక వాదం
చార్వాక దర్శనం
రచయిత : కత్తి పద్మారావు
పేజీలు : 231/-.
వెల : 200/-
ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి
లోకాయత ప్రచురణలు,
లుంబినీ వనం, అంబేడ్కర్
కాలనీ, పొన్నూరు

సంస్కృతం, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో పట్టున్న "కత్తి పద్మారావు గారు సోదాహరణంగా చార్వాకుల ముందు చూపును, వారి భౌతికవాద దృక్పథాన్ని అన్ని కోణాల నుండి వివరించారు.

పుస్తకానికి పీఠిక కొత్తదనాన్నిచ్చింది. నూరు పేజీలున్న ఆ పీఠిక భారతీయ తత్వశాస్త్రం పై సమగ్రమైన విమర్శ, సమగ్ర సమాచారం. నాటి లోకాయతుల నుండి నేటి అంబేద్కర్ వరకూ భారత తాత్విక ధోరణుల గురించి ఒక అభిప్రాయానికి రావటానికి తోడ్పడుతుంది. మన తత్వశాస్త్రంతో పాటు పాశ్చాత్య తాత్విక ధోరణులన్నింటినీ రచయిత పరిశీలన చేశారు. అరిస్టాటిల్ నుండి మార్క్స్ వరకూ ఐరోపాలో జరిగిన తాత్విక పరిణామాన్ని భారతీయ తత్వశాస్త్ర క్రమంతో పోల్చుతూ చర్చించటం విశేషం. మొత్తం మీద భారతీయ మూలవాసుల తత్వశాస్త్రమైన చార్వాక సిద్ధాంత ప్రతిపాదనల అవసరం నేటికీ ఎంత ప్రాధాన్యత ఉందో ఆయన వివరించారు. ముగింపుగా కొత్తతరానికి, సరికొత్త ప్రతిపాదనలతో మన ముందుకు వచ్చారు.

"భారతీయ సామాజిక వాస్తవికతను శాస్త్రీయంగా అధ్యయనం చేయాలంటే భారతీయ తాత్విక, రాజకీయోద్యమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లాలంటే చార్వాకుల తాత్విక, రాజకీయ పోరాటాలను అవగాహన చేసుకొని భారతీయ పరిస్థితులకు 'గతి తార్కిక చారిత్రక భౌతికవాద, దృక్పథంతో అన్వయించుకొని ముందుకు తీసుకువెళ్లాలి. ఒక్కొక్కడు ఒక్కొక్క చార్వాకుడిగా, ఒక భౌతిక వాదిగా, పోరాట శక్తిగా ముందుకు నడవాల్సిన చారిత్రక అవసరం ఈనాడు బలీయంగా ఉంది. మరీ ముఖ్యంగా దళిత, బలహీన, మైనార్టీ వర్గాలు భౌతికవాద పోరాట శక్తితోనే అగ్రవర్ణ రాజ్యాధికారాన్ని కూల్చి పేద ప్రజల రాజ్యాన్ని నిర్మించగలుగుతారు. ఆ నిర్మాణ కృషిలో భాగంగా 'చార్వాక దర్శనం' భారత ఉపఖండంలోని వివిధ జాతులు పోరాటాలకు 'తాత్విక భూమికను' రూపొందిస్తుంది. త్యాగంతో, సమర్పణతో, అవగాహనతో,అన్వేషణతో అద్వితీయ పోరాట శక్తులుగా దళిత బలహీన మైనార్టీ వర్గాలు చార్వాకుల వారసులై భావవాద, కర్మవాద, మూఢాచార, వర్ణ వ్యవస్థ పునాదులను సమూలంగా పెకలించి 'గతితార్కిక చారిత్రక భౌతికవాద దృక్పథంతో కూడిన సమ రాజ్యాన్ని నిర్మించడానికి సమరయోధులుగా సముజ్వల శక్తితో ముందుకు నడవండి 'చార్వాక దర్శనం' మీకు ఆయుధమౌతుంది"

ఇదీ కత్తి పద్మారావు గారి ప్రతిపాదన. ఆలోచించదగిన ప్రతిపాదన ఇది. కొత్తమార్పుకు దోహదపడే మార్గాన్ని ఆయన ప్రతిపాదించారు. అందుకే నేడున్న సంక్లిష్ట రాజకీయ పరిస్థితులలో, ఫాసిస్టు హిందూత్వ శక్తులను ఎదుర్కొనటానికి ఈ చార్వాక దర్శనం పుస్తకం ఒక ఆయుధంలా ఉపయోగపడుతుంది.

లోకాయత ప్రచురణలు నాల్గవ ముద్రణగా వెలువడిన ఈ పుస్తకం కూర్పు కొంత వైవిధ్యభరితంగా ఉంది. ప్రతి పేజీలో సంబంధిత పేజీలో ముఖ్య విషయం బాక్సులో ఇవ్వటం, సంబంధిత ఫోటోను తోడు చేయటం బాగుంది.

-భవిష్య



ఫుట్‌పాత్ స్కూల్

ప్రభుత్వ పాఠశాల మొదలుకొని... కార్పొరేట్ స్కూళ్ల వరకు చాలా రకాల స్కూళ్లను చూసి వుంటాం. ఇప్పుడు మనం చెప్పుకోబోయేది మాత్రం ప్రత్యేకమైనది. ఎందుకంటే ఈ బడి నడిచేది రోడ్డు మీదే కనక. మధ్యలో రోడ్డు. బుర్రుబుర్రుమంటూ వచ్చే.. పోయే వాహనాలు. ఆ రోడ్డుకు అటూ ఇటూ సన్నపాటి ఫుట్‌పాత్. వరుసగా పేర్చిన ఇనుప బల్లలు.. వాటి మీద కూర్చుని శ్రద్ధగా పాఠాలు నేర్చుకునే చిన్న చిన్న పిల్లలు. మనకు వింతగా అనిపించినా స్థానికులకు మాత్రం ఇది అలవాటైన దృశ్యమే.

హైదరాబాద్‌లోని భుదార్‌పురలో ఎవరినడిగినా చెప్తారు...ఫుట్ పాత్ స్కూల్ గురించి. మరి ఒకటా.. రెండా.. పదిహేనేళ్లుగా నడుస్తోంది. ఆ ఘనతంతా కమల్ పర్మార్‌దే. ప్రస్తుతానికి ఇక్కడ 155 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరంతా స్థానికంగా వున్న పలు మున్సిపల్ స్కూళ్లలో చదువుకునేవారే. అక్కడ స్కూల్ అయిన దగ్గర నుంచి ఫుట్‌పాత్ బడికి చేరుకుంటారు. కమల్ సార్ కాక మరి కొందరు స్వచ్ఛందంగా పాఠాలు చెప్తుంటారు. అన్ని స్కూళ్లకు మల్లే ఇక్కడ తరగతి గదులు, ప్రశాంత వాతావరణం, బాగా చదువుకున్న ఉపాధ్యాయులు వుండరు. అంతో ఇంతో చదువుకున్న వారు స్వచ్ఛందంగా పాఠాలు చెప్తుంటే... వాహనాల రణగొణ ధ్వనులను ఏమాత్రం పట్టించుకోకుండా శ్రద్ధగా పాఠాలు నేర్చుకుంటుంటారు చిన్నారులు. రాత్రి పూట టీచర్లు, పిల్లలు అంతా కలిసి భోజనం చేసి ఇళ్లకెళ్లిపోతారు. దాదాపుగా ఇక్కడికొచ్చే వారంతా పేద పిల్లలే కనక... ఆకలితో వుంటారని కమల్ సారే ఆ ఏర్పాటు చేశారు. ఉచితంగా పెడ్తున్నామన్న ఉద్దేశం ఏనాడూ ఆయనలో కనిపించదు. పిల్లలు ఎంతో ఇష్టంగా తినే ఇడ్లీ సాంబార్, పావ్-భాజీ, చానా పూరికి తోడు రకరకాల స్వీట్లు పెడతారు. అది కూడా చాలా శుచిగా వండించి వేడివేడిగా వడ్డిస్తారు. చదువు, ఆటపాటలతో అలసి పోయిన ఆ పసివాళ్లు ఆవురావురుమంటూ తినడం చూసి తృప్తిగా నిట్టూరుస్తుంటారు కమల్ సార్. ఏడాదికోసారి తన ప్రియతమ విద్యార్థులను పిక్నిక్‌కి కూడా తీసుకెళ్తారు.

ఈ ఫుట్‌పాత్ స్కూల్లో చదువుకున్న వారిలో కొందరు ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నవారూ వున్నారు. ఇటీవలే ఓ విద్యార్థిని బ్యాంకు మేనేజర్‌గా నియమితురాలైంది. మరో ఇద్దరు కంప్యూటర్ ఇంజనీర్, మెడికల్ ఇంజనీర్ కూడా అయ్యారు. మరొకరు వైద్య విద్య అభ్యసించేందకు ఇటీవలే దరఖాస్తు చేసుకున్నారు. ఈ విజయం సాధించింది చిన్నారులే అయినా నిజానికది కమల్ సార్ సక్సెస్.

ఎలా మొదలైంది?

కమల్ సార్ నిజానికి మాష్టారు కాదు. మెకానిక్ గ్యారేజీ యజమాని. పదిహేనేళ్ల కిందట ఓసారి తన గ్యారేజీ బయట నిలబడినప్పుడు మున్సిపల్ బడిలో చదువుకునే పిల్లలు గుంపులు గుంపులుగా కోలాహలంగా ఇళ్లకు వెళ్తూ కనిపించారు. వారి సంతోషానికి కారణమేంటని అడిగితే పరీక్షల చివరిరోజని చెప్పారు. వారి చేతుల్లో వున్న ప్రశ్నాపత్రం తీసుకుని ఒక్కో ప్రశ్నా అడుగుతుంటే ఒక్కరూ ఒక్కదానికి కూడా సమాధానం చెప్పలేకపోయారు. కనీసం ఆ పేపర్ తిరిగి చదవలేకపోవడం ఆయన్ని ఆశ్చర్యపరచింది. కేవలం అక్షరాలు మాత్రమే గుర్తించగలుగుతున్నారు. మరి ఎలా రాశారంటే బాగా రాశామంటారు. ఏం రాశారంటే ఆ ప్రశ్నా పత్రాన్నే తిరిగి జవాబుల పత్రంలో రాశారట. ఆ పసివాళ్లు అమాయకంగా చెప్పిన మాటలు ఆయన్ను ఆ రాత్రికి నిద్రకు దూరం చేశాయి. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ తిరిగి 400 మంది స్కూలు పిల్లలను కలిసి తను ప్రారంభించబోయే బడికి రమ్మని ఆహ్వానించారు. పది మంది పిల్లలు పోగయ్యారు. సొంతగా తన గ్యారేజీలోనే బల్లలు తయారు చేయించి వేయించారు. మొదట్లో ఏడు సబ్జెక్టులను తనే చెప్పేవారు. పాఠం చెప్పాక ప్రశ్నలు తయారు చేసుకుని వాటికి జవాబులు కూడా రాయమనేవారు కమల్ సార్. అలా రాశాక వాటిని చదువుకునేవారు. తర్వాత ఆ దారెంట వెళ్లే వారిలో ఔత్సాహికులు, ఇదే పాఠశాలలో చదువుకుని ఇంటర్ పాసైన వారు పాఠాలు చెప్పేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయం తెలిసి చిన్నారుల భోజనానికి ఆర్థిక సాయం చేస్తామంటూ మరికొందరు ముందుకొచ్చారు. కమల్ పిల్లలు కూడా తండ్రి మనసెరిగి... గ్యారేజీ పనులు తాము చూసుకుంటూ .... సమాజ సేవ చేస్తున్న తండ్రిని చూసి గర్విస్తుంటారు. అలా కొంతమంది పెద్ద మనసున్న వారు చేస్తున్న సాయంతో 'ఫుట్‌పాత్ స్కూల్ విజయవంతంగా నడుస్తోంది. ఇదంతా చదువుతుంటే మనం గతంలో చెప్పుకున్న ఢిల్లీ బ్రిడ్జి స్కూలు గుర్తొస్తోంది కదూ.



పులి లేడిపిల్లను వేటాడటం మనం చూశాం. సింహం జింకను పరిగెత్తించి పట్టుకోవడం చూశాం. పులులు, సింహాలు గర్జిస్తూ తలపడటం చూశాం. పొట్టేళ్లు కొమ్ములు విరిగిపోయేలా కొట్టుకోవడం చూశాం. కానీ, పొట్టేలును మేకపిల్ల మట్టి కరిపించడం చూశారా.? మేకపిల్ల సింహాన్నే సివంగిలా ఎదుర్కోవడం చూశారా.? చూస్తారా..? అయితే హర్యానాలోని రోహతక్ వెళ్లాల్సిందే. అక్కడ రెండు మేకపిల్లలు సింహాల్లా గర్జిస్తున్నాయి. బరిలోకి దూకి తొడగొట్టి మరీ సవాలు చేస్తున్నాయి. ఆ మేకపిల్లల పేర్లు మానసి, ఖుషీ. ఇద్దరూ అహ్లావత్ కుటుంబానికి చెందిన అక్కాచెల్లెళ్లు. ఇద్దరూ టీనేజ్‌లోనే ఉన్నారు. రెజ్లింగ్ యోధురాళ్లుగా సంసిద్ధమవుతున్నారు.

సివంగి సిస్టర్స్

దంగాల్‌లో ఇద్దరు రెజ్లర్లు కలబడి కొట్టుకుంటున్నారు. అందులో ఒకరు మానసి. కాసేపటికే మానసి తల ప్రత్యర్థి చేతిలో ఇరుక్కుంది. ఇక మానసి పని అయిపోయిందనే చూసేవాళ్లు అనుకున్నారు. ఊపిరాడక కళ్లు తేలేయాల్సిన మానసి సివంగిలా గర్జించింది. ఒక్క క్షణంలోనే తన మెడను నొక్కుతున్న ఆ చేతిని మెలితిప్పేసింది. అంతే మరో రెండు క్షణాల్లో ప్రత్యర్థి నేలకూలింది. విజయగర్వంతో మానసి తన కోచ్ వంక తలెత్తి చూసింది. ఈ సీన్ ఆ కోచ్‌కు అలవాటే. అందుకే చిరునవ్వుతో చూస్తూ నిలబడ్డాడు. రోహతక్‌లోని చోటూరామ్ స్టేడియంలో ఇలా 78 మంది దాకా రెజ్లర్లు ప్రాక్టీస్ చేస్తున్నారు. వారిలో మానసి, ఖుషీలది మాత్రం స్పెషల్ స్టోరీ.

సేమ్ టు సేమ్

"ఆకారంలోనే తేడా. అంతే తప్ప మగవాళ్లకు మాకు తేడా లేదు. వారికెంత శక్తి ఉందో మాకు అంతకంటే ఎక్కువ శక్తి ఉంది. ఎవరితోనైనా తలపడే సత్తా మాకుంది" ఒక చేయి ప్యాంటు జేబులో పెట్టి.. ఇంకో చేత్తో క్రాఫ్‌ని వెనక్కి తోస్తూ యమా స్టైలిష్‌గా చెప్పే మానసిని చూస్తే.. ఆమె చెప్పింది నిజమేనని నమ్మాల్సిందే. క్రాఫ్‌తోనే ఉండే చెల్లెలు ఖుషీ కూడా అంతే ప్రత్యర్థి సైజుతో సంబంధం లేకుండా.. తన సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో సవాల్ చేసి మరీ బరిలో గెలుస్తుంది. ఖుషీ ఫేస్‌లో ఇచ్చే ఎక్స్‌ప్రెషన్స్‌కే అవతలివాళ్లు సగం ఓడిపోతారు. మానసి, ఖుషీలు రెజ్లర్లుగా మారటానికి ఓ బలమైన కారణం ఉంది.

పట్టు పట్టాల్సిందే

రోహతక్ జిల్లాలోని 143 గ్రామాల్లో వెయ్యి మంది మగాళ్లకు గాను 879 మంది ఆడవాళ్లు మాత్రమే ఉన్నారు. ఎప్పటి నుంచో వేళ్లూనుకుపోయిన ఫ్యూడల్ వ్యవస్థ వలన.. ఆడవారిపై దాడులు చాలా ఎక్కువ. చదువుకోవటానికి వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి. రోజురోజుకు ఆడపిల్లలపై పెరుగుతున్న దాడులను ఎదుర్కోవడానికి అక్కడి జనం ఒక నిర్ణయం తీసుకున్నారు. తమ పిల్లలను పులుల్లా తయారు చేయాలనుకున్నారు. సాధారణంగా మగవాళ్లే ఆడే రెజ్లింగ్ బరిలోకి ఆడపిల్లలను దింపారు. తమ ఆడపిల్లలను కన్నెత్తి చూడటానికి ఎవరూ సాహసించలేనంత స్ట్రాంగ్‌గా తయారు చేస్తున్నారు. ఆత్మరక్షణ కోసం మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు రెజ్లింగ్ ఛాంపియన్లను పుట్టిస్తోంది.

మానసి, ఖుషీలను అడిగితే ఇంకో కారణం చెబుతారు.. "మా ఇంట్లో పొలం దున్నే ఎద్దులే కాదు.. పాలిచ్చే ఆవులు కూడా రావాలి. మాకూ కారు కావాలి. బ్రాండెడ్ బట్టలతో అదరగొట్టాలి. ఆటలో గెలిచి తెచ్చే మెడల్సే కాదు.. డబ్బులతో మా ఇల్లు బృందావనంగా మారిపోవాలి" ఇదే వారి కలగా చెబుతారు. వారి రూమ్‌లో స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్ ఫోటో ఉంటుంది. అలాగే రెజ్లింగ్ సిస్టర్స్‌గా పేరు తెచ్చుకున్న గీత, బబిత ఫోగట్ తమకు ఇన్‌స్పిరేషన్ అని చెబుతారు.

ఉదయం నాలుగున్నరకు మొదలయ్యేవారి దినచర్య రాత్రి 8 గంటలకు ముగుస్తుంది. ఎందుకంటే మొదట రెజ్లింగ్‌కు వెళ్లాలనుకున్నప్పుడు.. బంధువొకరు ఫిట్‌నెస్ పెంచుకోవాలని సలహా ఇచ్చారు. ఇందుకు జిమ్నాస్టిక్స్‌కు వెళ్లమని సూచించారు. దాంతో జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేస్తూ.. రెగ్యులర్‌గా రన్నింగ్‌కు కూడా వెళతారు. స్కూల్‌లో కూడా వీరు క్లాసులకు రాకపోయినా ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తారు. వీరి లక్ష్యానికి అలా స్కూల్‌వారు కూడా ప్రోత్సాహకంగా నిలబడుతున్నారు. స్టేట్ లెవెల్ ఛాంపియన్‌షిప్‌లో సెకండ్, థర్డ్ ప్లేస్‌లను గెలుచుకున్నారు. ఒలింపిక్స్‌లో మెడల్ కొట్టడమే తమ టార్గెట్ అంటున్నారీ రెజ్లింగ్ సిస్టర్స్.

ఒకప్పుడు వారు ప్రాక్టీస్‌కు వెళ్లాలంటే ఆటోలో వెళ్లాల్సి వచ్చేది. అందుకు చాలా ఖర్చవుతుంది. ఎందుకంటే అది పది కిలోమీటర్ల దూరంలో ఉండేది. ఇప్పుడు బైక్ మీద వెళ్లి వచ్చేస్తున్నారు. ప్రాక్టీస్‌కు వెళ్లి ఇంటికి వచ్చి రెస్ట్ తీసుకుని మళ్లీ స్కూల్‌కు వెళ్లడం.. సాయంత్రం తిరిగి కోచింగ్‌కు వెళ్లడం. కోచింగ్‌కు ముందు వెనక రన్నింగ్, జిమ్నాస్టిక్స్ చేయడం.. ఇలా అలుపెరగకుండా.. లక్ష్యాన్ని అందుకోవడం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు.

ఆడపిల్లలను ఆడపులులుగా పెంచుతున్నారనే ప్రశ్నకు వారి తండ్రి చిరునవ్వుతో సమాధానం చెప్పారు. "వాళ్లు అలా ఉండటమే మాకిష్టం. ఇంట్లో మాకు వాళ్లు ఆడపిల్లలే. కాని బయటికెళితే ఆడపులులే. అదే మాక్కావాల్సింది". అని గర్వంగా చెప్పారు.

ఈ రెజ్లింగ్ సిస్టర్స్‌కి కుటుంబం నుంచి అందే ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. వీరు ప్రాక్టీస్‌కెళ్లేటప్పుడు వీరితో పాటు అమ్మమ్మ వస్తుంది. వీరికి కావాల్సినవన్నీ సమకూర్చే పనిలో తండ్రి ఉంటాడు. ఇంట్లోవారందరిదీ ఒకటే కోరిక. తమ పిల్లలను ఛాంపియన్లుగా చూడాలి. వారు ఎగరేసే విజయబావుటా.. మహిళా సాధికారితకు అసలైన బాట వేస్తుంది.

- కిరణం

నేను కవిని...!
ఓ రవిని....!!

నా కలం సిరాలో
వేడి పొడలు నిండుగానే వున్నాయి!
నిద్రపోతున్న మానవత్వానికి
మేలుకొలుపు రాయమంటాడు ఒకడు...
అంధకారంలో అలమటిస్తోన్న మానవ జాతికి
అక్షర జ్యోతిని వెలిగించి
వెలుగు బాట చూపమంటాడు మరొకడు...
మదమెక్కి మారణ హోమం సృష్టిస్తోన్న
మృగ సంతతికి నీతి వాక్యాలు రాసి
హిత బోధ చేయమంటాడు వేరొకడు...
నన్ను ఆదరించేవాడు నా పలుకుల్ని
ఆలకించేవాడు
శూన్యంతో సహజీవనం చేస్తున్నాడు!
చుక్కాని పెట్టి వెతికినా కనిపించడు...!!
సమాజ సంక్షేమం... సాంస్కృతిక వికాసం...
ఎవ్వరికీ అక్కర్లేదిప్పుడు....!
నేను.. నా కుటుంబం...
బాగుంటే చాలు....!
పక్కింటి వాడు ఏమైపోతేనేం.....!?
ఎదురింట్లో మనుష్యులు
ఏ గంగలో కలిస్తే నాకేం....!?
నరజాతి చరిత్ర సమస్తం
స్వార్థం ఊబిలో కూరుకుపోయిన ఈ వేళ
బాధ్యత నా ఒక్కడిదేనా!
నా రాతలు.. నా కవితాక్షరాల తీక్షణ జ్వాలలు...
నిద్ర నటిస్తోన్న పాలకుల్ని
స్పందింపజేయుట సాధ్యమా..?
మద్యపానం చట్ట సమ్మతం నేడు!
దొంగతనాలు దోపిడీలు...
మానభంగాలు మారణ హోమాలు..
అంతేనా..!
అత్యున్నత న్యాయస్థానం ఆదేశం..?
వ్యభిచారానిక్కూడా రేపు లైసెన్స్!
పాలకుల అరాచక పాలనకు
జేజేలు పలుకుతోన్న చదువుకున్న మూర్ఖులకు
నా ప్రబోధ గేయాలను ఆలకించేలా
నా కవితా గానం వినిపిస్తాను...!
చీకటి దారుల్లో పయనిస్తోన్న
సభ్య సమాజ మానవాళికి
సమ సమాజ నిర్మాణ ధ్యేయాన్ని
అంతిమ గమ్యంగా నిర్దేశిస్తాను!
వెలుగు దివిటీనై... అభ్యుదయ పథాన...
ముందుకు మున్ముందుకు సాగుతాను!

- విడుదల సాంబశివ రావు
9866400059

మీరా.. మా దేశభక్తిని శంకించేది!

మనువు రగిల్చిన మంటల్లో
మా అస్థిత్వాన్ని కాల్చేశారు
అభివృద్ధి మంత్రాలు వల్లించి
గద్దెనెక్కి దేశాన్ని తాకట్టు పెట్టిన
నయా ఉదార వాదులు, సామ్రాజ్య
వాదులు,
భగత్ సింగ్ ఉసురు తీసిన
ఆంగ్లేయులకు అంటకాగిన వాళ్లు
గాంధీని చంపిన గాడ్సేకి
గుడి కట్టదలచిన దేశ ద్రోహులు,
చరిత్రను వక్రీకరించి
విద్యను నాశనం చేస్తున్న
వక్రమార్కులు,
మానవత్వాన్ని మరిచి
మతతత్వాన్ని దత్తత తీసుకున్న
హిందూత్వ తాలిబన్లు
మీరా మా దేశభక్తిని శంకించేది?
మీరా మమ్మల్ని ఉగ్రవాదులని
నిందించేది?
సంపన్నుల చేతుల్లో దేశం
నలిగిపోతుంటే
పేదల పక్షం పోరాడటమే
పాపమైపోయింది
స్వరాజ్యం వచ్చిందని మేం
చంకలెగరెయ్యలేదు
సురాజ్యం కోసం దశాబ్దాలు తరబడి,
మరో స్వాతంత్ర్య సంగ్రామం
సాగిస్తున్నాం, సాగిస్తూనే వుంటాం!!
మేము మార్క్స్ సృష్టించిన ప్రపంచ
కార్మికులం
మేము అంబేద్కర్ ఆశించిన
సమసమాజ స్థాపకులం
మేము శ్రీశ్రీ కాంక్షించిన నవయుగ
యువకులం
మేము జాషువా రచించిన విశ్వ
నరులం, విద్యార్థులం
కుటిల శక్తులు నిర్మించిన నిచ్చెన
మెట్ల వ్యవస్థను కాల్చడానికి
మా రగిలే గుండెలు, బిగిసిన ఉక్కు
పిడికిళ్లు ఏకమై కదులుతున్నాయి!
రోహిత్‌కి నీలి జోహార్లు చెబుతూ
కన్నయ్యకు లాల్ సలామ్ కొడుతూ..
జేఎన్‌యూ, హెచ్‌సీయూ విద్యార్థుల
ఉద్యమ పథానికి బాసటగా
నిలుస్తూ...

నూతక్కి శ్రీనివాసరావు
9704385593



క్యారెట్-దోస సలాడ్

కావాల్సిన పదార్థాలు:
దోసకాయ - 1
క్యారెట్‌లు - 2 (చిన్నవి)
కొత్తిమీర తరుగు - 3 టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి - 1 టేబుల్ స్పూన్
నువ్వులు - 1టీ స్పూను
ఆలివ్ నూనె - 1 టేబుల్ స్పూన్, ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం:
ముందుగా దోసకాయ, క్యారెట్‌లను శుభ్రంగా కడిగి ముక్కలుగా తరిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఒక బౌల్‌లోకి మిరియాల పొడి, నువ్వులు, ఉప్పు, ఆలివ్ నూనె వేసి బాగా కలుపుకోవాలి. ముందుగా తరిగి పెట్టుకున్న క్యారెట్, దోసకాయ ముక్కలు కొంచెం కొత్తిమీర , మిరియాల పొడి మిశ్రమంలో వేసి మరోసారి కలపాలి. ఇప్పుడు కొంచెం మిరియాల పొడి కొత్తిమీర తరుగుతో చక్కగా గార్నిష్ చేసి ఎండలో ఇంటికొచ్చిన అతిథులకు అందించండి.

సలాడ్‌తో చలవ

మిక్స్‌డ్ వెజిటబుల్ సలాడ్

కావాల్సిన పదార్థాలు
టమోటాలు - 2
ముల్లంగి - 1
క్యారెట్ - 2
ఉల్లిపాయ - 1
దోసకాయ - 1
నిమ్మకాయ - 1
పుదీనా ఆకులు - 10
కొత్తిమీర తరుగు - 1 కప్పు, మిరియాల పొడి - 1 టేబుల్ స్పూన్, ఉప్పు - రుచికి తగినంత

తయారు చేసే విధానం
ముందుగా కూరగాయలను శుభ్రంగా కడిగి కొంతసేపు ఆరనివ్వాలి. తర్వాత ఉల్లిపాయ, దోసకాయ పైతోలు తీసి గుండ్రంగా ముక్కలు తరిగి ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. తర్వాత క్యారెట్, ముల్లంగి, టమోటాలను కొంచెం పెద్ద ముక్కలుగా తరిగి ఒక వెడల్పాటి ప్లేట్‌లో తరిగిన ముక్కలన్నింటినీ ఉంచాలి. వాటిపై మిరియాల పొడి, నిమ్మ రసం, ఉప్పు, పొదీనా ఆకులు వేసి కొంత సేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. సర్వ్ చేసే ముందు ఫ్రిజ్ నుండి బైటికి తీసి కొత్తిమీరతో గార్నిష్ చేస్తే పిల్లలు కూడా వీటిని ఇష్టంగా తింటారు. ఈ సలాడ్ రైస్, చపాతీల్లోకి కూడా టేస్టీగా ఉంటుంది.



దోస- బీట్‌రూట్ సలాడ్

కావాల్సిన పదార్థాలు:
బీట్‌రూట్ - 3
దోసకాయ - 1 చిన్నది
క్యారెట్- 1
నిమ్మరసం - 2 టేబుల్ స్పూన్లు
మిరియాల పొడి - 1 టేబుల్ స్పూను

తయారు చేసే విధానం:
ముందుగా బీట్‌రూట్, క్యారెట్, దోసకాయను శుభ్రంగా కడిగి పై చెక్కు తీసి పొడుగు ముక్కలుగా తరిగి పక్కన పెట్టుకోవాలి. చిన్న బౌల్‌లో నిమ్మరసం, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని తరిగి పెట్టుకున్న కూరగాయ ముక్కలపై వేసి కలపాలి. సర్వింగ్ ప్లేట్స్‌లోకి సలాడ్‌ని తీసుకుని కొత్తిమీరతో గార్నిష్ చేసి అతిథులకు అందించండి.



వెజ్జీ-నట్స్ సలాడ్

కావాల్సిన పదార్థాలు:
క్యారెట్ ముక్కలు - 2 కప్పులు
దోసకాయ ముక్కలు- 1 కప్పు
తెల్ల ముల్లంగి ముక్కలు - 1/2 కప్పు, టమోటా ముక్కలు - 2 కప్పులు, ఉల్లిపాయ ముక్కలు -1 కప్పు, గుమ్మడికాయ గింజలు - 2 టేబుల్ స్పూన్లు, నువ్వులు - 1/2 టేబుల్ స్పూన్, బాదం - 1 టేబుల్ స్పూన్, జీడి పప్పు - 1 టేబుల్ స్పూన్
పిస్తా పప్పు - 1 టేబుల్ స్పూన్
ఆలివ్ నూనె - 1/2 టేబుల్ స్పూన్
నిమ్మ రసం - 1 టేబుల్ స్పూన్
పొదీనా ఆకులు - 4, కొత్తిమీర తరుగు - 1 కప్పు, మిరియాల పొడి- 1 టేబుల్ స్పూన్
ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం:
కూరగాయలను శుభ్రంగా కడిగి ముక్కలుగా తరిగి పెట్టకోవాలి. బాదం, పిస్తా, జీడి పప్పులను చిన్న ముక్కలుగా కట్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టి తరిగి పెట్టుకున్న పిస్తా, బాదం ముక్కలు, నువ్వులు, గుమ్మడి కాయ గింజలను గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి. ఒక బౌల్ తీసుకుని నిమ్మరసం, మిరియాల పొడి, ఆలివ్ నూనె, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు ఒక వెడల్పాటి ప్లేట్ తీసుకుని కూరగాయ ముక్కలను పరిచి అందులో ఆలివ్ మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. వేయించి పెట్టుకున్న నువ్వులు, బాదం గింజల మిశ్రమాన్ని సలాడ్‌కి జతచేర్చి మరోసారి కలపాలి. పొదీనా, కొత్తిమీరతో గార్నిష్ చేస్తే వెజ్జీ నట్స్ సలాడ్ రెడీ!





తప్పుకి శిక్ష తప్పదు

- చల్లపల్లి సాంబశివ
7794890676

సాయంత్రం సమయం ఐదు దాటింది. ఆకాశంలో దట్టంగా పరుచుకున్న నీలి మేఘాలు కొండల మధ్య నుంచి వెళుతున్నాయి. ఈ ప్రశాంత వాతావరణంలో ట్రెయిన్ ముందుకు పరుగు తీస్తుంటే కిటికీ పక్కన కూర్చున్న కృష్ణన్ మనసు మాత్రం జరిగిపోయిన విషయం గుర్తుకు తెచ్చుకోడానికి వెనక్కి పరుగు తీస్తోంది. దాదాపు అర గంట ఆలోచనల తర్వాత చేసిన తప్పులకి శిక్ష తప్పదన్న మాట నిజం అనిపించింది కృష్ణన్‌కి. ఇంతలో తన ఆలోచనల్ని ఆపటానికొచ్చినట్లు ఎదురు సీట్లో కూర్చున్న వ్యక్తి ట్రెయిన్ కూత కంటే గట్టిగా మాట్లాడుతున్నాడు. పుర్ర చెయ్యి పైకెత్తి చెవికి ఫోన్ గట్టిగా నొక్కి పెట్టి అటు వైపువారి మాటలు వినిపించడం లేదన్నట్టు చాలా గట్టిగా మాట్లాడుతున్నాడు. తన మాటల వైపు దృష్టి సారించాడు కృష్ణన్.

"ఈ మధ్య... నీకు తెలియంది ఏముందిరా ఉద్యోగాలకి పోటీ ఎక్కువయ్యింది. ఎన్ని మార్కులు వచ్చినా డబ్బు, రికమెండేషన్ ఉన్నవారికే ఉద్యోగాలు లేవు" అంటూ కళ్లు మూసుకుని ఏదో ఆలోచిస్తున్నట్టు ఫోన్ మాట్లాడుతున్నాడు. ఆటువైపు వ్యక్తి నువ్వే ఏదోలా చూడాలిరా అన్నట్టున్నాడు. సీట్‌లో కూర్చున్న వ్యక్తి ఇచ్చిన సమాధానం బట్టి అతని మాటలు గ్రహించాడు కృష్ణన్. "సరే ఏదో ఒకటి లైన్ చేద్దాంలే కొంచెం ఖర్చవుతుంది. ఆ విషయం కూడా అడిగి ఉంచు.." అని చెప్పి కాల్ కట్ చేశాడు. అతని మాటలకు అర్థం ఏమిటో వేరొక సందేహం లేకుండా కృష్ణన్‌కి అర్థమయింది.

కొంతసేపటికి కృష్ణన్ పలకరించాడు.. "మీరు ఎక్కడి వరకు సార్" అని. అతను కూడా సానుకూలంగా స్పందిస్తూ.. "హైదరాబాద్ వరకండి. నా పేరు చంద్రశేఖర్." అని చెప్పాడు. "నా పేరు కృష్ణన్". అలా వాళ్ళిద్దరి మధ్యా మాటలు కుదిరాయి.

"మీరు ఎవరికైనా ఉద్యోగాలు ఇప్పిస్తారా?" అని కృష్ణన్ చంద్రశేఖర్ వంక ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగాడు. "ఇందాక ఫోన్‌లో నా మాటలకు మీకు అలాంటి ఉద్దేశం కలగడం సహజమే. మా కంపెనీలో కొన్ని ఉద్యోగాలు ఖాళీ అయ్యాయి. నాకు తెలిసిన ఒకతను ఉన్నాడు. అతనికి ఒక ఉద్యోగం ఇప్పిద్దామని చూస్తున్నా." అని చంద్రశేఖర్ తాపీగా కృష్ణన్ సందేహానికి ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశాడు. "కానీ మీరిలా అడ్డ దారుల్లో చేయడం వల్ల.. రెజ్యూమ్ పుచ్చుకుని మీ కంపెనీలో ఉద్యోగానికి అప్లై చేసేందుకు వచ్చేవారి పరిస్థితి?" అని సందేహంగా అడిగాడు కృష్ణన్.

"వాళ్ల పరిస్థితి ఏముంటుంది కృష్ణన్ గారూ... ఫస్ట్ మనం రికమెండేషన్‌తో, డబ్బులతో వచ్చేవారిని చూసుకుంటాం! ఆ తరువాతే బయట రెజ్యూమ్స్" చెప్పాడు చంద్రశేఖర్. "మరి అలాంటప్పుడు ఉద్యోగాలు వున్నాయని నోటీస్ బోర్డులో పెట్టడం ఎందుకు, పెట్టాక వచ్చేవారిని ఇలా అన్యాయం చేయడం ఎందుకు?" అని అడిగాడు కృష్ణన్. "అది కంపెనీ రూలండీ కృష్ణన్ గారూ. నా గొడవకేంగానీ ఇంతకి మీరు ఏం చేస్తుంటారు చెప్పండి కృష్ణన్ గారూ?" అని అడిగాడు చంద్రశేఖర్.

ఇంతలో ట్రెయిన్ పక్క పెట్టెలో అడుగు భాగంలో మంటలు చెలరేగాయి. కృష్ణన్ ముందు పెట్టెలో ఉన్న జనం భయాందోళనలకు గురయ్యారు. కంగారు, ప్రాణ భయంతో అందరూ అరుపులు కేకలు వేస్తున్నారు. ఇంతలో కృష్ణన్ పెట్టెలో ఉన్నవాళ్లకు తెలియని కంగారు పుట్టుకొచ్చింది. ట్రెయిన్ స్పీడ్‌గా వెళ్ళడం వల్ల గాలికి మంటలు ఇంకా పెద్దవవుతున్నాయి. ఇంతలో ఎవరికో వచ్చిన ఆలోచనతో ట్రెయిన్ చైన్ లాగారు. అప్పటికి మంటలు కుదుటపడ్డాయి. ట్రెయిన్ స్లో అవడంతో మంటలు మొత్తానికి ఆగిపోయాయి. ఇంతలో ట్రెయిన్ టెక్నీషియన్ వచ్చి "ఎవరికీ ఏమీ కాలేదు. ఎవరూ భయపడొద్దు. ట్రెయిన్ పెట్టె కింద గ్యాస్ లీక్ అవడం వల్ల, గాలికి మంటలు రాజుకున్నాయి." అని అందరికీ జరిగింది చెప్పి గ్యాస్ పైప్‌ను గట్టిగా బిగించి వెళ్లిపోయాడు.

ట్రెయిన్ యథావిధిగా తన ప్రయాణం మొదలు పెట్టింది. ట్రెయిన్‌లో జరిగిన ఈ సంఘటనకు చంద్రశేఖర్‌కి బీపీ డౌనై పోయి భయంగా సీట్‌లో ఒక మూల కూర్చుండి పోయాడు. వంటి నిండా చెమటలు పట్టేశాయి. ఇంతలో బాత్ రూమ్‌కి వెళ్లి వచ్చిన కృష్ణన్.. "ఏమైంది చంద్రశేఖర్ గారూ ఇలా అయిపోయారు.." అని కంగారు పడుతూ వాటర్ బాటిల్‌లో వాటర్ పట్టించాడు. బీపీ ట్యాబ్లెట్ వేసుకున్నాక కుదుట పడ్డాడు చంద్రశేఖర్. "ఏమైంది ఒక్కసారిగా అలా అయిపోయారు" అని అడిగాడు కృష్ణన్. "నిజం చెప్పాలంటే.. నాకు చాలా భయం ఎక్కువండీ!! ట్రెయిన్‌లో మంటలు రావడంతో నాకు భయంలో కంగారు ఎక్కువై బీపీ డౌనైపోయింది" నీరసంగా జరిగిందంతా కృష్ణన్‌కి వివరించాడు చంద్రశేఖర్. "నా గురించి అడిగారు. ఇంతకీ నా గురించి చెప్పడం మొదలు పెడితే మీ బీపీ డబుల్ అవుతుందేమో.... సరే చెబుతున్నా వినండి" అని కృష్ణన్ చెప్పడం మొదలు పెట్టాడు.

•••••

కృష్ణన్ ఒక ప్రైవేట్ కంపెనీలో మేనేజర్ దగ్గర పని చేసేవాడు. చాలా సంవత్సరాలు అదే కంపెనీలో చెయ్యడంతో అందరితో మంచి స్నేహం ఏర్పడింది కృష్ణన్‌కు. ఆ కంపెనీ మేనేజర్ కృష్ణన్

తెలివితేటలు చూసి అతన్ని బాగా ఇష్టపడేవాడు. ఏ పని చెప్పినా నిమిషంలో చేసిచ్చేసేవాడు. ఒక్కోసారి మేనేజర్ రాకపోయినా ఆఫీస్‌లో పనులన్నీ చక్కపెట్టేవాడు.. కృష్ణన్.

కొంత కాలానికి ఆఫీస్‌లో ఎకౌంటెంట్ ఆరోగ్యం బాగోలేక చెప్పా పెట్టకుండా మానేయడంతో ఎకౌంటెంట్ పోస్టు ఖాళీ అయింది. “సెక్యూరిటీ రూమ్‌లో ఏమైనా రెజ్యూమ్స్ ఉంటే చూడు. లేకపోతే సెక్యూరిటీకి నోటీస్ అంటించమను” అని కృష్ణన్‌కి చెప్పి మేనేజర్ వెళ్లిపోయాడు. ఇంతలో స్నేహితుడు ఫోన్ చేయడంతో ఆఫీస్ రూమ్‌లోనే కూర్చుని కృష్ణన్ ఫోన్ మాట్లాడుతున్నాడు. “ఏమిటిరా కుమార్ ఇలా చేశావ్?” అనడిగాడు కృష్ణన్. “నీతో చిన్న పని పడిందిరా! నాకు తెలిసిన ఒక కుర్రాడున్నాడు. మంచి తెలివైన వాడు. ఇంటర్ పూర్తయింది. డిగ్రీ సర్టిఫికెట్ తన తెలివితేటలతో సంపాదించాడు. మీ కంపెనీలో ఏమైనా పోస్టులు ఉంటే చూడు.” అని అన్నాడు కుమార్. “ఒక పోస్ట్ ఉందిరా కొంచెం ఖర్చవుతుంది” అని అన్నాడు కృష్ణన్. “ఎంత ఖర్చయినా పర్వాలేదు” కొంచెం ఉత్సాహంగా అన్నాడు కుమార్. ఇంతలో ఆఫీస్ రూమ్‌లోకి సెక్యూరిటీ రావడంతో ఫోన్ కట్ చేశాడు కృష్ణన్.

“నేనే నీ దగ్గరికి వద్దాం అనుకుంటున్నా నువ్వేమిటి ఇలా వచ్చావ్” అని అడిగాడు కృష్ణన్ సెక్యూరిటీని. “సార్ ఒక కుర్రోడు వచ్చాడు రెజ్యూమ్ తీసుకుని ఉద్యోగం చాలా అవసరమట సార్! మా కంపెనీలో వేకెన్సీ లేదంటే వినిపించుకోవట్లేదు.” అన్నాడు సెక్యూరిటీ. “భలేగా తెలిసిపోతుందయ్యా ఎక్కడైనా ఉద్యోగం ఖాళీ అయితే..సరే రెజ్యూమ్ తీసుకు రమ్మను నేను ఇక్కడే ఉంటాను” అని సెక్యూరిటీకి చెప్పాడు కృష్ణన్. అబ్బాయిని చూడగానే కృష్ణన్‌కి చాలా మంచి ఉద్దేశం కలిగింది. “మీరేనా ఇంటర్వ్యూకి వచ్చింది?.. “అవును సార్” అని చాలా గౌరవంగా చెప్పాడు ఇంటర్వ్యూకి వచ్చిన వ్యక్తి. అతని మాటల్లో మర్యాదా పద్ధతీ అతని కళ్లలో నిజాయితీ కృష్ణన్‌కి చాలా బాగా నచ్చాయి. ఒక్క క్షణం ఆలోచించి అతని రెజ్యూమ్ అంతా ఒక్కసారి కలియచూశాడు కృష్ణన్. “ఇప్పుడయితే మా కంపెనీలో ఏ పోస్టూ ఖాళీ లేదు. ఉంటే తప్పకుండా మేమే కాల్ చేస్తాము. మీరు సెక్యూరిటీని రిక్వెస్ట్ చేశారని లోపలికి పంపారు. ఉద్యోగం ఎంత అవసరమైనా ఇక్కడ పోస్టు లేకుండా మేము మాత్రం తీసుకోలేముగా..” అని చెప్పడంతో నిరాశగా వెనుతిరిగాడు వచ్చిన వ్యక్తి.

“సార్ నన్ను కుమార్ గారు పంపించారు కృష్ణన్ గారిని కలవమని..” అని చెప్పి తరువాత రోజు ఆఫీస్‌కి ఓ కొత్త కుర్రోడు వచ్చాడు. “ఓహో మీరేనా కుమార్ చెప్పిన వ్యక్తి..” “అవును సార్” అని ఆ వ్యక్తి సమాధానం ఇచ్చాడు. “మీ పేరు?” “లోకేష్” అని చెప్పాడతను. “మీకు కుమార్ అంతా చెప్పే ఉంటాడు...” లోకేష్ వంక చూస్తూ అన్నాడు కృష్ణన్. “ఆ.. చెప్పాడు సార్! మీరు అడిగిన అమౌంట్ కుమార్ గారికి ఉదయాన్నే ఇచ్చేశాను సార్.” అని కృష్ణన్ వంక చూస్తూ నవ్వుతూ చెప్పాడు. “అవునా లోకేష్! నిన్న ఒకతను రెజ్యూమ్ తీసుకుని వచ్చాడు. చూడగానే చాలా నిజాయితీగా అనిపించాడు. అతనికి ఈ ఉద్యోగం ఇచ్చేయాలనేలా ఉన్నాడు. ఒక్క క్షణం ఆలోచించి.. ఆ మంచి మనకి భోజనం పెట్టదుగా అనిపించింది. అదే నువ్వనుకో మనకి కావలసినట్టు ఎకౌంట్స్ రాయగలవు” కృష్ణన్ లోకేష్ వంక చూస్తూ చెప్పాడు. తప్పకుండా సార్.. అని ఒక్క నవ్వు నవ్వాడు. ఆ నవ్వులోని అర్థం కృష్ణన్‌కు చాలా.స్పష్టంగా అర్థమయింది.



లోకేష్ జాయిన్ అయిన వారం రోజులకి కృష్ణన్‌కి ఒంట్లో బాగోలేక ఓ పది రోజులు సెలవు తీసుకున్నాడు. ఈ పది రోజుల్లో ఎలాంటి లెక్కలు ఎక్కడెక్కడ రాయాలి, ఎలా ఎకౌంట్స్ తారుమారు చేయాలి.. అనే విషయాలను తన తెలివితేటలతో అతి తక్కువ సమయంలోనే తెలుసుకున్నాడు లోకేష్. కృష్ణన్‌కి పది రోజులకి కూడా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఇంకా ఎక్కువ కాలం కంపెనీకి సెలవు తీసుకున్నాడు. ఈ గ్యాప్‌లో లోకేష్ మేనేజర్‌కి కూడా బాగా దగ్గరయ్యాడు. లోకేష్ తెలివితేటలు మాటలు మేనేజర్‌కి బాగా నచ్చడంతో లోకేష్‌ని దగ్గర ఉంచేసుకున్నాడు. అదే అదునుగా చూసుకుని పాత ఎకౌంట్స్ పుస్తకాలన్నీ రీకౌంటింగ్ చేయించాడు. కృష్ణన్ ఉన్న టైమ్‌లో లెక్కలు ఎలా రాయించాడో కృష్ణన్ గురించి స్లోగా మేనేజర్‌కి ఎక్కేసి చెప్పాడు.. ఎలా అయినా మేనేజర్ పక్కన స్థిరపడిపోవాలనే ఆశతో.

•••••

“లోకేష్ అనుకున్నట్టే అతని తెలివితేటలతో నన్ను కంపెనీ నుండి తీయించేశాడు. తప్పుడు లెక్కలు రాయించినందుకు నా మీద పోలీస్ కేసు కూడా పెట్టారు కంపెనీ వాళ్లు. ఆ కేసులన్నీ ముగిసే సరికి చాలా కాలం పట్టింది.” అని కృష్ణన్ చెప్పడం ఆపాడు. “నిజాయితీగా ముందు ఇంటర్వ్యూకి వచ్చిన వ్యక్తికి ఉద్యోగం ఇచ్చుంటే ఇంత జరిగేది కాదు.” అని కృష్ణన్ బాధపడ్డాడు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదన్న మాట నిజం అనిపించింది కృష్ణన్‌కు.

కృష్ణన్ కథంతా వినగానే చంద్రశేఖర్‌కి మూర్ఛ రోగం వచ్చినట్టు ఒక మూల కూలబడిపోయాడు. నాకు జరిగింది ఇంక ఎవరికీ జరగకూడదని ఇదంతా మీకు చెప్పాను. నేను ఆ రోజు నిజాయితీగా ఉండి ఉంటే ఈ రోజు ఇంత శిక్ష అనుభవించేవాణ్ని కాదు. కృష్ణన్ అన్నాకే కొంతసేపటికి చంద్రశేఖర్ తేరుకుని “పాపం మొదట ఇంటర్వ్యూకి వచ్చిన వ్యక్తికి అన్యాయం జరిగింది.” అని జాలిగా అన్నాడు. మౌనంగా తలూపాడు కృష్ణన్. ఇంతలో టికెట్ కలెక్టర్ రావడంతో ఆ మౌనానికి ఫుల్‌స్టాప్ పడింది. చంద్రశేఖర్ టికెట్ తీసుకుని సంతకం చేశాడు టి.సి.. తర్వాత కృష్ణన్ కూడా టికెట్ తీసిచ్చాడు. టి.సి. టికెట్‌ను తిరిగి ఇచ్చే సందర్భంలో “మిమ్మల్ని ఎక్కడో చూశాను?” అన్నాడు కృష్ణన్ ప్రశ్నార్థకంగా. “నన్ను ఎక్కడో చూడ్డం ఏమిటండీ మీ కంపెనీకి ఇంటర్వ్యూకి వచ్చానుగా ప్రవీణ్ నా పేరు..” అని చెప్పగానే కృష్ణన్ ఒక్కసారిగా షాకయ్యాడు. ప్రవీణ్ వంక అలా ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు కృష్ణన్. “కొన్ని నెలల క్రితమే రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా జాబ్ వచ్చింది సార్” అని చాలా ఆనందంగా చెప్పాడు ప్రవీణ్. ఎవరికి జరగాల్సిన న్యాయం వాళ్లకి జరిగింది.. అని అనిపించింది కృష్ణన్‌కి.

✦

చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేను క్రికెట్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: రాహుల్ ద్రావిడ్

నీడతో బొమ్మ

పిల్లలూ! మీరు నీటిలో ఉండే మొసళ్లని చూసే వుంటారు. అయితే చేతివేళ్ల సాయంతో మొసలి రూపాన్ని నీడలో ఎలా తేవచ్చో ఇక్కడ ఇచ్చాం! కాంతికి అడ్డంగా చేతులు పెట్టి గోడ మీద నీడ పడేట్లు మీరూ ప్రయత్నించండి.



ఏ నీడ ఎవరిది ?

పిల్లలూ! ఇక్కడ కొన్ని వస్తువులు వాటి ఎదురుగా నీడలు ఉన్నాయి. ఏ వస్తువు నీడ ఎక్కడుందో గుర్తించి వాటిని జత చేయండి.



లెక్కించండి

ఇక్కడున్న రెండు వృత్తాల్లో పెద్ద వృత్తంలోని రెండు అంకెల్ని కూడితే చిన్న వృత్తాల్లోని అంకెలు ఏర్పడ్డాయి. అయితే చిన్న వృత్తాల్లో ఒకచోట అంకె మిస్సయింది. అది ఎంతై వుంటుందో కనిపెట్టేయండి!



క్లూ : పెద్ద వృత్తంలోని రెండు పక్క పక్క అంకెల్ని కూడి ఎదురుగా వున్న చిన్న వృత్తంలో దాన్ని రాస్తే మీకు జవాబు దొరికినట్టే!

కొంటె ప్రశ్న

భూమి గుండ్రంగా ఎందుకుంటుంది?

జవాబు: తిరిగేందుకు వీలుగా వుంటుందని..

చిట్టి తాబేలు



పిల్లలూ! మీకు తాబేలు కుందేలు కథ గుర్తుంది కదూ! చిన్న చిన్న అడుగులేసుకుంటూ నిదానంగా నడిచే చిట్టిపొట్టి తాబేలు బొమ్మలు మనకి షాపుల్లో కూడా దొరుకుతాయి. అయితే మనింట్లో దొరికే వస్తువులతో వాటిని మనమే తయారు చేసుకుంటే ఆ మజానే వేరుకదా! వాటిని ఎలా తయారుచేసుకోవాలో మేము నేర్పిస్తాం బుద్ధిగా నేర్చేసుకోండే!

కావాల్సిన వస్తువులు

పేపర్ ప్లేట్, రంగు పెన్సిళ్ళు/స్కెచ్ పెన్ /(పెయింట్ కూడా వాడుకోవచ్చు) కత్తెర, గమ్, కన్‌స్ట్రక్షన్ పేపర్

తయారు చేసే విధానం

పేపర్ ప్లేట్ తీసుకుని లోపలి భాగంలో స్కెచ్/రంగు పెన్సిల్/ పెయింట్‌ని ఉపయోగించి ఆకుపచ్చ రంగు వేయాలి. తర్వాత కన్‌స్ట్రక్షన్ పేపర్ తీసుకుని స్కెచ్ పెన్‌తో తాబేలు శరీర భాగాలను (ముఖం, చేతులు, కాళ్లు, తోక) గీసి వాటికి కూడా ఆకుపచ్చరంగు వేసి కొంతసేపటి తర్వాత కత్తెరతో జాగ్రత్తగా కత్తిరించాలి. మరో కన్‌స్ట్రక్షన్ పేపర్‌పై పేపర్ ప్లేట్‌ని తిరగతిప్పి పెట్టి అర్ధవృత్తాన్ని గీసి దాన్ని జాగ్రత్తగా కత్తిరించాలి. ఇప్పుడు అర్ధవృత్తానికి పసుపు రంగువేసి దాన్ని పేపర్ ప్లేట్ పైభాగంలో సగం ఆకుపచ్చ, సగం పసుపు రంగులు కనిపించేలా అతికించాలి. ఇప్పుడు కత్తిరించి పెట్టుకున్న తాబేలు మొఖం, చేతులు, కాళ్లు, తోకను గమ్‌తో అతికించాలి. ఇంకా మీరేమైనా డిజైన్స్ వేయాలనుకుంటే కన్‌స్ట్రక్షన్ పేపర్‌పై వేసుకుని వాటిని కూడా కట్‌చేసి అతికించుకోవచ్చు. చివరిగా స్కెచ్ పెన్‌తో తాబేలు కళ్లు, ముక్కు, నోరు గీస్తే చిట్టి తాబేలు బొమ్మ రెడీ!

త ద వి కా స ం - 8

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2		✿	3		✿	4		5
6		✿	7		✿	8		✿	
	✿	9		✿	10		✿	11	
✿	12		✿	13		✿	14		
15		✿	16		✿	17			✿
	✿	18		✿	19			✿	20
✿	21		✿	22		✿	✿	23	
24		✿	25		✿	26	27		
	✿	28		✿	29				✿
30				✿	31			✿	32

ఆధారాలు

అడ్డం

1. మోసకారి, టక్కరి (3)
3. శరీరం (2)
4. పిల్లలు తాడుతో తిప్పేది (3)
6. దళం, పటాలం (2)
7. దెబ్బ (2)
8. విత్తనాలు ఎరుపు, పప్పు పసుపు (2)
9. ఆలస్యం (2)
10. వీక్షించు (2)
11. కొత్త నూతన (2)
12. ఆధారం, మట్టిపెళ్ల (2)
13. చివర్లో లేని వీలునామా (2)
14. మా అమ్మ (3)
15. లీలది వ్యక్తిగతం. మొదలు, చివర (2)
16. విపులంగా తుది లేదు (2)
17. ప్రసవం, పురుడు (3)
18. మనసు, మది (3)
19. నిద్రలే (3)
21. ఆకు, రాసుకునే కాగితం (2)
22. అది వేసుకుని నటిస్తారు (2)
23. పాపాత్ముడు (2)
24. తారీఖు (2)
25. రాత్రి (2)
26. ఈ నెలలో జనులుంటారు (4)
28. సారం, ధైర్యం (2)
29. తడబడు 3,1,4,2 (4)
30. వైస్ ఛాన్సలర్ కంటే పెద్ద (4)
31. యుద్ధం, కలత, గజిబిజి (3)

నిలువు

1. మిశ్రమం, గుంపు (3)
2. పడిపోవు (2)
3. కరచు (2)
4. మేను, శరీరం (2)
5. ముగ్గు (4)
7. గూఢచారి (2)
8. కాంస్యం (2)
9. అచూకి, ఆనవాలు (2)
10. గర్భం, సంతతి (2)
11. నవనీతపు 1,4,5 (3)
13. వెన్ను (2)
14. వదులుకో, ఆగిపో (3)
15. రంగులు చల్లుకునే పండుగ పైకి (2)
16. ధనం (2)
17. కందలేని కందకాలు (2)
18. బొమ్మ, ఓ సినిమా (2)
19. పొట్టేలు, ఒక రాశి (2)
20. ఆరంభం లేని అలిపిరి (3)
21. ఒకటి తర్వాత సున్నా (2)
22. సహస్రం (2)
23. పరికిణి, వస్త్రం (3)
24. టీపొడి దీనినుంచే తయారు (3)
25. ఒక నక్షత్రం, నటి (3)
26. తోడుగా (3)
27. నరుడు సరిలేడు (3)
28. మత్స్యం (2)
29. కొంగ (2)
32. ఒక ఇంగ్లీషు అక్షరం ఎందుకు? (1)

సుడోకు

4			8	1	5	6		
		7			3		1	
8			4	7				
2			1			7	9	8
1	7	5				2	4	6
6	8	9			7			1
				8	1			2
	2		9			1		
		4	5	6	2			3

గతవారం జవాబులు

9	1	8	2	3	5	4	6	7
3	6	7	8	9	4	5	1	2
2	4	5	6	1	7	9	8	3
8	7	6	9	2	1	3	4	5
1	9	2	4	5	3	6	7	8
4	5	3	7	6	8	2	9	1
5	2	9	1	7	6	8	3	4
6	8	1	3	4	2	7	5	9
7	3	4	5	8	9	1	2	6

1 తి	2 రు	3 ప	తి	✿	4 ల	5 గా	య	6 తు	✿
7 క	టా	క్షం	✿	8 స	య	ర	✿	9 రం	గు
10 మ	ని	✿	11 వి	✿	12 కా	డి	✿	గం	✿
క	✿	13 జ	✿	14 చె	డు	✿	15 మీ	✿	16 కో
✿	17 య	✿	18 నీ	కు	✿	19 సీ	తా	20 ప	తి
21 మా	✿	22 ము	ఖా	ము	ఖి	✿	23 త	డి	✿
✿	24 కు	✿	25 మం	కి	✿	26 దొ	✿	27 సెం	28 టు
29 మ	యు	30 రా	దు	✿	31 త	రో	32 చే	✿	మా
33 సూ	క్షు	లు	✿	34 పా	ట	✿	లు	✿	రో
35 రి	లు	✿	36 ఎం	డ	✿	37 ల్యా	✿	38 టి	✿

నూడిల్స్‌కో గ్రామం

నూడిల్స్ అనగానే చైనా గుర్తొచ్చేస్తుంది. సంప్రదాయ వంటకమే కాకుండా సింబాలిక్‌గాను రెండు చాప్ స్టిక్స్ మధ్యలో నూడిల్స్ చిత్రం వాడేయొచ్చు. ఇక్కడ నూడిల్స్‌ను ఏదో ఫాస్ట్‌ఫుడ్‌గా లాగిస్తారు కానీ అక్కడ మాత్రం ప్రధాన ఆహారమదే. అనేక ఫ్లేవర్లు, పద్ధతుల్లో ఎన్నో వెరైటీల్లో వేడి వేడిగా బౌల్‌ను అందిస్తే సర్రున నోట్లోకి లాగేసుకోకుండా ఉండలేం. అలాంటి చోట ఇక ఏకంగా ఓ గ్రామం గ్రామమే నూడిల్స్ తయారీలో అంకితమైందంటే వింతేముంది. షాంక్సీ ప్రావిన్స్‌లోని షిక్సియా గ్రామంలో ఫ్యాక్టరీల్లో కాకుండా చేతి వృత్తిగా నూడిల్స్‌ను తయారు చేసేస్తారు. అలా చేయలేకపోతే అతణ్ని లావోషాన్ అదే షాంక్సీ వాసి అని పిలవరు. 600 ఏళ్లుగా ఇలా ఈ గ్రామం కాంగ్షిన్ నూడిల్స్ అనే ప్రత్యేక వెరైటీకి ప్రసిద్ధి చెందింది. లోపల బోలుగా ఉండే ఈ న్యూడిల్స్‌ను తయారు చేసేపుడు మీటర్లకు మీటర్లు బారున ఒకే తాడుగా చేసినా ఇవి తెగిపోవు. వీటిని నార తాళ్లలా దండాలకు ఆరబెడతారు. ఈ ఊరిలో మొత్తం 500 ఇళ్లుంటాయి. ఇక్కడ మరో ప్రత్యేకత ఏమిటంటే తల వెంట్రుకంత పలుచగాను నూడిల్స్‌ను చేసేవారున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో ఎటువంటి అడిటివ్స్ వాడకుండా పౌష్టికమైన నూడిల్స్ అందిస్తారు.

రన్నర్ రోడెంట్

హౌ ఫన్నీ..!

ఏం జోక్ గురూ అంటూ పొర్లాడి మరీ నవ్వే సీల్, పక్షులు వాలుతుంటే.. 'వామ్మో వామ్మో' అంటూ గాబరాగా పరిగెత్తే హిప్పో, పోలీసులు తరుముతున్న దొంగలా లంఘించిన ఓ రోడెంట్, తప్పతాగి నడుస్తున్నట్టున్న ఓ కోతి, పార్కులో గాళ్‌ఫ్రెండ్‌తో దొరికిపోయిన ప్రేమికుడిలా ఓ గుడ్లగూబ, అదేదో చాక్లెట్ యాడ్‌లో ఎప్పుడూ భుజాల మీద చేతులు వేసుకుని తిరిగే సోదరులు రమేష్, సురేష్‌లా వానర మిత్రులు ఇలా రకరకాల ఫోజులతో కడుపుబ్బ నవ్వించేసే జంతువుల ఫొటోలివి. తొలి కామెడీ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ అవార్డుల్లో ఎంపికైన వాటిలో మరీ కామెడీ చేసినవి ఇవే. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీలో భీకరమైనవి కాక ఇలా సిల్లీగా ఉండే వాటికీ స్థానమివ్వాలని లండన్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ పాల్ జాయ్‌న్సన్ హిక్స్ ఈ అవార్డుల్ని పరిచయం చేశాడు. గతేడాది అక్టోబర్ నాటికి 52 దేశాల నుంచి 1502 ఎంట్రీలు రాగా 45 ఫైనల్స్‌కు చేరుకున్నాయి. వాటిలో రష్ అవర్ పేరిట ఆస్ట్రియన్ ఫొటోగ్రాఫర్ జులియన్ రాడ్ తీసిన రన్నర్ రోడెంట్‌కు అవార్డు దక్కింది. ఎంపిక జ్యూరీలో బ్రిటిష్ కమెడియన్ హ్యూగ్ డెన్నిస్ కూడా ఉన్నాడు. అరె అవార్డు వచ్చిన విషయం వాటికి చెప్పేదెలా అని బుర్ర గోక్కుంటూ ఓ జోక్ కూడా పేల్చారు నిర్వాహకులు.

Check List

Book Number	KNSR02B114	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29